# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక



తీన్మార్ మెల్కొల్పు

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెల్కొల్పు కార్యక్రమంలో

భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు

రచనలు, కవితలు & వ్యాసాలు


-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 257 | పేజీలు : 8 | మంగళవారం 24 మార్చి 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

- 2029 ఎన్నికల నుంచి అమల్లోకి!
- అప్పుడు తెలంగాణలో 179, ఏపీలో 263 శాసనసభ సెగ్మెంట్లు
- దేశంలో 543 నుంచి 816కి లోక్‌సభ స్థానాలు... ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు
- ఎన్డీయే భాగస్వాములకు చెప్పిన అమిత్‌షా .. ముందుగానే మహిళా రిజర్వేషన్ కోటా

3లో

## కొత్త చరిత్ర సృష్టిస్తుందా?



- బెంగాల్ టైగర్ల ఖరి భవానీపూర్
- టీఎంసీకి అత్యంత విశ్వసనీయమైన స్థానమిది
- ఇక్కడి నుంచే మమతపై పోటీకి దిగుతున్న సువేందు అధికారి
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట... ప్రస్తుతం తృణమూల్ ఖిల్లా..

3



## యుద్ధం మానవాళికి శ్రేయం కాదు

- పశ్చిమాసియా పరిస్థితులతో మనకూ సవాళ్లు: మోదీ
- ఆ ప్రాంతం మీదుగా నౌకలు రావడం ఎంతో సవాల్‌గా మారినా తమ ప్రభుత్వ ప్రయత్నాలతో పెద్దగా అవాంతరం లేకుండా ఇంధనాలు సరఫరా అవుతున్నాయి
- చమురు, గ్యాస్ అవసరాలు తీర్చేందుకు వేర్వేరు దేశాల సరఫరాదారులతో ప్రభుత్వం సంప్రదింపులు సాగిస్తోంది


# ప్రజలకు నష్టం చేయం



- మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పిస్తాం: సీఎం రేవంత్
- మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం
- ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు.. పార్టీలు అపోహలు సృష్టించకూడదు
- మీరు సలహాలు ఇస్తే తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాం..
- అందరం కలిసి హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసుకుందాం
- శాసనమండలిలో ముఖ్యమంత్రి

హైదరాబాద్

'మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరికీ నష్టం చేయం. నిరాశ్రయులను చేయం. పునరావాసం కల్పిస్తాం. మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం. ప్రాజెక్టును నిర్మిస్తూనే అక్కడ నష్టపోయే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తాం. బఫర్ జోన్‌లో ఉండే వారికి ఏ రకంగా సహాయం అందించాలో అందిస్తాం. రాజకీయ ప్రయోజనాల కోసం మిమ్మల్ని ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో అపోహలు సృష్టించకూడదు. అందరం కలిసి హైదరాబాద్ నగరాన్ని అద్భు తంగా అభివృద్ధి చేసుకుందాం..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీలు - మిగతా2లో



## బీజేపీ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- ఆటోలో అసెంబ్లీ వద్దకు వచ్చిన రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు
- బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా చేరుకున్న బీజేపీ కార్యకర్తలు.. ఎక్కడికక్కడ అరెస్ట్‌లు

హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి'పార్టీ నాయకులు--పోలీసుల మధ్య తోపులాటతో ఉద్రిక్తంగా మారింది. పోలీసుల కళ్లు కప్పి ఆటోలో అసెంబ్లీ ప్రధాన గేటు వద్దకు చేరుకొని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఇతర నేతలు నిరసన తెలిపారు. నాంపల్లి నుంచి అసెంబ్లీ వైపు నకు కార్యకర్తలు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. '6 గ్యారంటీలు ఎక్కడ'అని నినాదాలు చేస్తూ అసెంబ్లీ సమీపానికి చేరుకొని బారికేడ్లు దాటేందుకు యతినంచిన - మిగతా2లో

# ప్రాజెక్టులు అప్పగించకుండా ఎలా అదుపు చేయాలి?

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను నిలదీసిన కృష్ణా బోర్డు
- శ్రీశైలం, సాగర్ నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాలు పరస్పరం ఫిర్యాదు
- కేడబ్ల్యూడీటీ--2 తుది తీర్పు వెలువడితేనే స్పష్టత వస్తుందన్న బోర్డు
- అప్పటి వరకు సమన్వయంతో వ్యవహరించాలని ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలకు లేఖ




హైదరాబాద్

కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించకుండా.. నీటి వినియోగాన్ని అదుపు చేయాలని పరస్పరం తమకు ఫిర్యాదు చేస్తే ఎలా అదుపు చేయగలమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలను కృష్ణా బోర్డు ప్రశ్నించింది. కేడబ్ల్యూడీటీ (కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్)--2 తుది తీర్పు వెలువడే వరకూ ఇరు రాష్ట్రాలు సమన్వయంతో నీటిని వినియోగించుకోవాలని సూచించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కృష్ణా బోర్డు ఈ నెల 20న లేఖ రాసింది. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని ఏపీ ఈఎన్‌సీ.. వాటా కంటే ఎక్కువ నీటిని ఏపీ వాడుకున్నందున, అదనంగా నీటిని వాడుకోకుండా నియంత్రించాలంటూ తెలంగాణ ఈఎన్‌సీ ఇటీవల కృష్ణా బోర్డుకు లేఖలు రాశారు. తెలంగాణ కూడా కోటా కంటే ఎక్కువ నీటిని వాడుకుందని.. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి అదనపు నీటిని వాడుకోకుండా నియంత్రించాలని ఏపీ ఈఎన్‌సీ లేఖలో పేర్కొన్నారు. దీనిపై కృష్ణా బోర్డు స్పందిస్తూ కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా - మిగతా2లో

# ప్రజలకు నష్టం చేయం

-మొదటిపేజీ తరువాయి

మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ సోమవారం శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు సీఎం సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.

**కావాలంటే కేబినెట్ కమిటీ వేస్తాం..**

'మూసీ ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన నుంచి బయటకు రండి. ముందుకు తీసుకెళ్లడానికి సలహాలు ఇవ్వండి. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది తామే అని సిరిసిల్ల ఎమ్మెల్యే చెప్పారు. మూసీ నది వెంట 50 మీటర్ల బఫర్ జోన్ కూడా మీరు నిర్ణయించిందే. మీరు ప్రారంభించి అర్థాంతరంగా వదిలేసిన పనినే మేం ముందుకు తీసుకెళుతున్నాం. ఈ విషయంలో మీరు ఏ సూచన చేసినా పరిగణనలోకి తీసుకుంటాం. ప్రజలకు ఉపయోగపడేవి అయితే 100% అమలు చేస్తాం. నాకు సూచనలు ఇవ్వడానికి ఏదైనా ఇబ్బంది ఉంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కేబినెట్ సబ్ కమిటీ వేస్తాం. ఆ కమిటీకి మీ సూచనలు చెప్పొచ్చు.

**ప్రాణాంతకంగా మూసీ నీళ్లు**

నల్లగొండ జిల్లా ప్రజల కష్టాలను చూస్తే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును ఎవరూ అడ్డుకోరు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగరంలో కాలుష్యం, జంతువుల కళేబరాలు, మనుషుల శవాలతో ఆ నీళ్లు వారికి ప్రాణాంతకంగా మారాయి. ఆ ప్రాంతంలో పండిన పంటలు, బోర్లలో నీళ్లు కూడా పిల్లలపైన విపరీతమైన ప్రభావం చూపిస్తున్నాయి. ఆ సమస్యల నుంచి స్థానికులకు విముక్తి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. మూసీలో శుభ్రమైన నీరు ప్రవహించేలా గోదావరి జలాలు తెస్తున్నాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

**మూసీ బఫర్ జోన్ 50 మీటర్లు**

'గాంధీసరోవర్ నిర్మించేందుకు 98 ఎకరాల రక్షణ శాఖ భూమిని కేంద్రం ఇస్తుంది. టూరిజం శాఖ దగ్గర ఇంకో 100 ఎకరాలు ఉన్నాయి. ఆ అపార్ట్‌మెంట్‌ల (మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌ల అంశాన్ని ఉద్దేశించి) భూమి తీసుకోకపోయినా పరవాలేదు. కానీ ఆ అపార్ట్‌మెంట్‌లలో ఉండే మిత్రులు 2005--06లో 9 మీటర్ల బఫర్ జోన్ చూపించి అనుమతులు తీసుకున్నారు. అయితే 2016లో మూసీ బఫర్ జోన్ 50 మీటర్లు అయ్యింది. ఆ ప్రకారం మార్క్ చేస్తే సగం అపార్ట్‌మెంట్‌లు బఫర్ జోన్‌లో ఉంటాయి. భవిష్యత్తులో వాటిని అమ్ముకోవడానికి వీలుకాదు. అందువల్ల నష్టం జరుగుతుందని మాత్రమే చెబుతున్నాం. మీకు ఇష్టమైతే, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఆ భూమిని ఇప్పుడు ఇస్తే నష్టపరిహారం ఇస్తాం. ప్రత్యామ్నాయం చూపడానికి కూడా అభ్యంతరం లేదు.

**హైదరాబాద్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్**

ఎంతో ఘన చరిత్ర ఉన్న హైదరాబాద్‌లో మానవ తప్పిదాలతో సమస్యలు వస్తున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేశాం. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు జోన్లుగా విభజించాం. క్యూర్ పరిధిని సేవా రంగంగా, ప్యూర్‌ను తయారీ కేంద్రంగా, రేర్‌ను వ్యవసాయ ప్రాధాన్యతగా అభివృద్ధి చేయబోతున్నాం. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం (క్యూర్)లోని కాలుష్య కారక పరిశ్రమలను బయటకు తరలిస్తేం నగరం నివాస యోగ్యంగా మారుతుంది. అందుకే హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసే క్రమంలో ఒకే విధమైన పరిపాలన విధానం కోసం మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, నాలుగు పోలీసు కమిషనరేట్లు ఏర్పాటు చేశాం. భవిష్యత్ అభివృద్ధి కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను తయారు చేశాం..'అని సీఎం తెలిపారు.

**మెట్రో విస్తరణ..ఎలివేటెడ్ కారిడార్లు**

'ప్రజల సౌకర్యం కోసం ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ఉన్న సమయంలోనే హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు సదుపాయం వచ్చింది. ఆనాడు దేశంలో రెండో స్థానంలో ఉన్న మన మెట్రో గత పదేళ్లలో నిర్లక్ష్యంతో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ అనుకూలంగా లేకపోవడంతో మెట్రోను రూ.15 వేల కోట్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం స్వాదీనం చేసుకుంటోంది. ఏప్రిల్ వరకు ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత లాస్ట్‌మైల్ కనెక్టివిటీ వచ్చేలా మెట్రో రైలును నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టుకు, గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట, రాయిదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మొత్తం 76 కిలోమీటర్ల మార్గాన్ని రూ.24 వేల కోట్లతో నిర్మించేందుకు అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయి. మెట్రో విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా ఉంది.

**హిమాయత్‌సాగర్ నుంచి గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్**

ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌కు రేడియల్ రోడ్లు వేస్తున్నాం. హిమాయత్‌సాగర్ నుంచి రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర ఉన్న గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ వేస్తున్నాం. గండిపేట నుంచి గౌరెల్లికి 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే చేరుకుంటారు. నగరంలో ఉండే వాళ్లు నగరం బయటకు వెళ్లేందుకు వీలుగా నగరం మధ్యలోంచి మూసీ వెంట ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తాం. దీనికి గౌలిగూడ బ్రిడ్జి దగ్గర, చాదర్‌ఘాట్ దగ్గర, నాగోల్ దగ్గర, అంబర్‌పేట జంక్షన్ దగ్గర ట్రంపెట్లు వస్తాయి. ఇలా హైదరాబాద్‌ను అద్భుత రీతిలో అభివృద్ధి చేసే ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం..'అని రేవంత్ వివరించారు.

**బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద రోడ్డు**

'హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు.. రోడ్లను అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్ అని మూడు రకాలుగా అభివృద్ధి చేస్తున్నాం. బేగంపేట్ ఎయిర్‌పోర్టు మధ్యలో రన్‌వే కింది నుంచి అండర్‌పాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి తెచ్చాం. పనులు జరుగుతున్నాయి. దేశంలో ఇలాంటి రోడ్డు ఎక్కడా లేదు. నల్లగొండ, విజయవాడ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్లను జూలై వరకు పూర్తిచేస్తాం. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలనుకుంటున్నాం. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఎక్కడైనా స్థలాన్ని కేటాయించి ప్రోత్సహిస్తాం. మల్టీలెవల్ పార్కింగ్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నాం..'అని సీఎం తెలిపారు.

# మీరు కాంప్రమైజ్ అయితే.. పార్టీ కాంప్రమైజ్ కాదు

హైదరాబాద్



'కాంగ్రెస్ సర్కార్‌పై గట్టిగా పోరాడండి.. ప్రజాసమస్యలు, ప్రభుత్వ హామీలు, గ్యారంటీలపై అధికార పార్టీని, నేతలను నిలదీయండి'అని బీజేపీ ముఖ్య నేతలు, నాయకులకు జాతీయ నాయకత్వం దిశానిర్దేశం చేసింది. తెలంగాణ బీజేపీలో కొందరు ముఖ్యనేతలు అధికార కాంగ్రెస్ పార్టీతో 'కాంప్రమైజ్ పాలిటిక్స్'నెరుపుతున్నారనే ఆరో పణల మధ్య.. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ద్వారా నాయకులకు గట్టి వార్నింగ్ పంపించినట్టుగా పార్టీవర్గాల సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో కేడర్ కష్టపడు తుంటే.. కొందరు ముఖ్యనేతలు, నాయకులు మాత్రం ఇతర పార్టీలతో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడటం వల్ల పార్టీ గ్రాఫ్ పడిపోతోందని బీజేపీ అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి రావాలన్న లక్ష్యసాధనకు పార్టీలో అన్ని స్థాయిల నాయకులపై అధిష్టానం కన్ను ఉందని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ఎంతటి వారినైనా పక్కన పెట్టేందుకు వెనుకాడబోమని హైకమాండ్ సంకేతాలిచ్చినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై, సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై కొందరు నేతలు మెతక ధోరణిని అవలంబిస్తూ అంత తీవ్రస్థాయిలో స్పందించడం లేదన్న విమర్శల మధ్య తాజాగా అభయ్‌పాటిల్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇటీ వల జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో పలు నియో జకవర్గాల్లో బీజేపీ ప్రజాప్రతినిధులు ఇతర పార్టీలతో చేతు లు కలిపారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ పరిణామా లపై సీరియస్‌గా ఉన్న బీజేపీ హైకమాండ్ పార్టీ లైన్ దాటి ఎవరైనా ప్రైవేట్ డీల్స్ కుదుర్చుకుంటే సహించేది లేదని పాటిల్ హెచ్చరికలు జారీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. శనివారం జీహెచ్ఎంసీ పరిధిలోని 9 జిల్లాల (పార్టీ యూని ట్లు) జిల్లా అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకు ల సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతల సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'మీరు కాంప్రమైజ్ అయితే.. పార్టీ కాంప్రమైజ్ కాదు'అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కమలదళంలో కలకలం రేపుతున్నాయి. తమతమ నియోజకవర్గాల్లో పట్టు కోసం లేదా కాంట్రాక్టులు, ఇతర వ్యక్తిగత ప్రయోజ నాల కోసం కొందరు నేతలు.. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు పరోక్షంగా సహకరిస్తున్నారని అభయ్‌పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాక...త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో సత్తాచాటడం అనేది కొందరు నేతల తీరు వల్ల బీజేపీకి అగ్నిపరీక్షగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే పార్టీలో ఏర్పడిన లోపాలు, కొందరు నేతల కుమ్మక్కు రాజకీయాలు, ఇతర సమస్యలను సరిదిద్దడమే లక్ష్యంగా అభయ్‌పాటిల్ రంగంలోకి దిగినట్టుగా పార్టీవర్గాలు చెబుతున్నారు. హైకమాండ్ వార్నింగ్‌తోనైనా కొందరు నేతల్లో మార్పు వస్తుందో లేదో చూడాల్సి ఉందని పార్టీ అంతర్గత చర్చల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# విద్వేషంపై ఉక్కుపాదం!

హైదరాబాద్



సమాజంలో మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ విద్వేష పూరిత ప్రసంగాలు, విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు, 2026)కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో మత సామరస్యానికి భంగం కలిగించేలా చేసే పోస్టులు, అల్లర్లు.. ఘర్షణలను ప్రేరేపించేలా చేసే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు సైతం ఇదే తరహా బిల్లును శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బిల్లును బీజేపీ వ్యతిరేకించింది. దీంతో గవర్నర్ దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. హేట్ స్పీచ్ బిల్లుకు ఆమోదం తెలపడంతో పాటు.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం శాసనసభ కమిటీ హాల్‌లో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

**వర్సిటీల్లో కుల వివక్ష నియంత్రణకు..**

విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా వ్యవహరించనున్నారు.

**గిగ్ వర్కర్స్‌కు భద్రత**

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం రూపొందించిన 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్ --2026' బిల్లును కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఈ బిల్లు అమల్లోకి వస్తే రాష్ట్రంలోని దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్స్, ప్లాట్‌ఫామ్ బేస్డ్ వర్కర్లకు ప్రయోజనం కలగనుంది. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్‌తో పాటు సంక్షేమ బోర్డు, నిధి ఏర్పాటు చేస్తారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు బోర్డు ఏర్పాటు ద్వారా వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్‌కు అనుగుణంగా స్వల్ప మార్పులతో కేబినెట్ ఆమోదించింది.

**మెట్రో స్వాధీనం చర్యలు వేగవంతం**

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతమున్న 69 కిలోమీటర్ల మెట్రో రైలు వ్యవస్థను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వం తరఫున నిధుల చెల్లింపులు, లావాదేవీలు నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు అప్పగించింది. హెచ్ఎంఆర్ఎల్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం**

తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, వారికి రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. గతంలో అడ్వకేట్ వామనరావు దంపతుల హత్య నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

**కులగణనపై కమిటీ నివేదికకు ఆమోదం**

రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను మంత్రివర్గం ఆమోదించింది. ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ నివేదిక తయారు చేసింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. కాగా నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి ప్రభుత్వం అప్పగించింది.

**తల్లిదండ్రులకు భరోసా..**

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు.. ఏది తక్కువైతే ఆ మొత్తం వేత నాల నుంచి పరిహరించి తల్లిదండ్రులకు అందజేసే తల్లిదండ్రులకు మద్దతు బిల్లును మంత్రివర్గం ఆమోదించింది.

## బీజేపీ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

-మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలను పోలీసులు అడ్డు కున్నారు. వివిధ జిల్లాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ వద్దకు చేరుకొని ముట్టడించే ప్రయత్నం చేశారు. అనంతరం రాంచందర్‌రావు తదితరులను అరెస్ట్ చేసి పంజగుట్ట స్టేషన్‌కు తరలించారు. ఆయన్ను సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత కూడా ఐదు, పది మంది చొప్పున కొన్ని బ్యాచ్‌ల వారీగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర రూపాల్లో శాసనసభ సమీ పానికి చేరుకున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.800 మందికి పైగా బీజేపీ కార్యకర్తలు, 50 మంది మహిళలు, యువమోర్చా కార్యకర్తలను అరెస్ట్ చేసి వివిధ ప్రాంతా ల్లోని 9 పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లారు. పలువురు నేతలను వారి ఇళ్ల వద్ద, అసెంబ్లీకి మార్గమధ్యలో హౌస్ అరెస్టులు చేసి పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, దాదాపు రెండున్నరేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ'కి రాష్ట్ర బీజేపీ పిలుపునిచ్చింది. శాసనసభ ముట్టడికి సంబంధించి పోలీసులకు ముందస్తు సమాచారంతో చుట్టుపక్కల పెద్దసంఖ్యలో మోహరించారు. సోమ వారం ఉదయం 11 గంటల నుంచి పలు దఫాలుగా బ్యాచ్‌లుబ్యాచ్‌లుగా అసెంబ్లీ వద్దకు చేరుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో డా.ఎన్.గౌతమ్‌రావు, టి. వీరేందర్‌గౌడ్, బండ కార్తీకరెడ్డి, శిల్పారెడ్డి, ఎన్వీ సుభాశ్, దీపక్‌రెడ్డి, గణేశ్, మహేందర్ ఉన్నారు. రాంచందర్‌రావును పోలీస్‌స్టేషన్ లో ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, డా.సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్య పరామర్శించారు.

**మోసపూరిత హామీల సర్కార్‌ను మరింత నిలదీస్తాం: రాంచందర్‌రావు**

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మోసపూరిత హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత నిలదీస్తామన్నారు.

**ప్రజావ్యతిరేక పాలనపై రాజీలేని పోరాటం: ఏలేటి**

కాంగ్రెస్ సర్కార్ ప్రజావ్యతిరేక పాలనపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందే తప్ప మడమ తిప్పదని బీజేఎల్?పనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నించిన రాంచందర్‌రావు అరెస్టు.. ప్రభుత్వ నిర్బంధ పాలనకు నిదర్శనమని ఒకప్రకటనలో విమర్శించారు.

## ప్రాజెక్టులు అప్పగించకుండా ఎలా అదుపు చేయాలి?

-మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్రకు 560, కర్ణాటకకు 700, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 800 టీఎంసీలను కేటాయించారని ఇరు రాష్ట్రాలకు గుర్తు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఇప్పటికీ పంపిణీ చేయలేదని తెలిపింది. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను కేంద్రం కేడబ్ల్యూడీటీ--2కు అప్పగించిందని గుర్తు చేసింది. నీటి పంపిణీపై కృష్ణా బోర్డు విచారణ చేస్తోందని పేర్కొంది. గెజిట్ నోటిఫికేషన్ అమల్లోకి వచ్చే వరకు ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలంను ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ సర్కార్ నిర్వహించాలని కేంద్రం పేర్కొందని వెల్లడించింది. ప్రాజెక్టులు తమకు అప్పగించని నేపథ్యంలో.. నీటి వినియోగాన్ని అదుపు చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేడబ్ల్యూడీటీ--2 తుది తీర్పు అమల్లోకి వచి?చ.. నీటి వాటాలు తేలే వరకూ రెండు రాష్ట్రాలు సమన్వయంతో నీటిని వినియోగించుకోవాలని కృష్ణా బోర్డు సూచించింది.

## సమ్మర్ మూవీస్ పై ఆశలు

హైదరాబాద్

సంవత్సరం తెలుగు సినిమా ఇండస్ట్రీల హవా కొనసాగుతుందనే చెప్పాలి. సంక్రాంతికి 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో చిరంజీవి భారీ సక్సెస్ ని సాధించాడు. 400 కోట్ల వరకు కలెక్షన్స్ ని కొల్లగొట్టాడు. సంక్రాంతి సీజన్ బాగా కలిసి రావడంతో ఆ తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీకి భారీ లాభాలు వస్తాయని అంచనాలో సినిమా మేధావులైతే ఉన్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే రీసెంట్ గా రిలీజ్ అయిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సైతం పాజిటివ్ టాక్ ను సంపాదించుకొని ముందుకు సాగుతుంది. ఇక అడివి శేష హీరోగా చేస్తున్న 'డకాయిట్' సినిమా సైతం ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే శర్వానంద్ బైకర్ సినిమా వస్తుంది. నిఖిల్ హీరోగా చేస్తున్న స్వయంభూ సినిమా కూడా ఈ సమ్మర్ లోనే వస్తుంది?ఇక ఈ సినిమాలతో పాటు గా ఏప్రిల్ 30 వ తేదీన రామ్ చరణ్ హీరోగా చేస్తున్న 'పెద్ది' సినిమా సైతం భారీ అంచనాలతో బరిలోకి దిగబోతుంది.ఇక మే నెలలో ఏ సినిమాలు రాబోతున్నాయి అనే విషయం మీద ఇంకా సరైన క్లారిటి రానప్పటికి మొత్తానికైతే ఈ సినిమాలన్ని భారీ విజయాలను సాధిస్తాయనే కాన్ఫిడెన్స్ ను వ్యక్తం చేస్తున్నారు. పెద్ది సినిమా ఈ సమ్మర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్ హిట్ గా నిలువబోతుందనే వార్తలు కూడా వస్తున్నాయి.ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అంటూ మేకర్స్ చెబుతున్నారు. దానికి తగ్గట్టుగానే ఈ సినిమా మీద ప్రేక్షకుల్లో విశేషమైన హైప్ కూడా ఉంది. ఇక ఇలాంటి క్రమంలోనే ఇండియన్ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసేలా రామ్ చరణ్ పెద్ది సినిమాతో భారీ రికార్డులను కొల్లగొడతాడా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీ కొంతవరకు డౌన్ లో ఉంది.దీనిని టాప్ లెవెల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రామ్ చరణ్ మీదే ఉంది అంటూ పలువురు సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాల్ని తెలియజేస్తుండటం విశేషం?చూడాలి మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను సాధిస్తుంది. తద్వారా మరోసారి తెలుగు సినిమా స్థాయి పెరుగుతుందా లేదా అనేది?

## అడ్డంగా బుక్కైన రోహిత్

హైదరాబాద్


తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన మాదకద్రవ్యాల పార్టీకి సంబంధించి కీలక నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ సాగిస్తున్న క్రమంలో విస్మయకర వాస్తవాలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. మొదట్లో ఈ వ్యవహారం వెనక దుబాయ్ ఆస్తులు.. బినామి వ్యక్తులు ఉన్నారని ప్రచారం జరిగింది. అయితే అంతకుమించిన దారుణమైన నిజాలు ఈ వ్యవహారం వెనుక ఉన్నాయని సమాచారం.ఈ పార్టీకి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన అభిషేక్ సింగ్ ప్రస్తుతం మహేశ్వరం ఎస్ఓటి పోలీసుల అదుపులో ఉన్నారు. ఆయనను శంషాబాద్ తరలించారు. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ సాగిస్తున్నారు. రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అభిషేక్ సింగ్ ను పోలీసులు విచారించారు. రోహిత్ రెడ్డి, అభిషేక్ మధ్య అనేక పర్యాయాలు మాదకద్రవ్యాల కొనుగోలు జరిగినట్టు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ కాల్ సంభాషణలను కూడా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బ్యాంకు ఖాతాల ఆధారంగా రోహిత్ రెడ్డి భారీగానే నగదును అభిషేక్ కు బట్వాడా చేసినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఐదు వీకెండ్ పార్టీలలో అభిషేక్ రోహిత్ రెడ్డికి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన సమాచారం. గతంలో 14 సార్లు.. వీకెండ్ పార్టీలు కలుపుకొని మొత్తం 19 సార్లు రోహిత్ రెడ్డి కి అభిషేక్ మాదకద్రవ్యాలను సరఫరా చేసినట్టు సమాచారం.వ్యవసాయ క్షేత్రంలో జరిగిన పార్టీలో రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ కు అభిషేక్ నిషేధిత మత్తు పదార్థం అందించిన సమాచారం. ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారుల విచారణలో ఇదే తేలింది. అభిషేక్ కు భారీగా నెట్వర్క్ ఉందని.. అందులో చాలామంది కస్టమర్లు ఉన్నారని సమాచారం. అభిషేక్ ఐటీ ఉద్యోగిగా పని చేస్తున్నాడని.. అతడు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడని.. గోవా, బెంగళూరు ప్రాంతంలో ఉన్న నైజీరియన్ వ్యక్తుల వద్ద నిషేధిత మత్తు పదార్థాలను కొనుగోలు చేసి..

# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

దిల్లీ

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185 అవుతాయి. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి చేరుతాయి. లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది.

కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ షా మాట్లాడే అవకాశం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు తెలిసింది.



లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

**ప్రాథమిక జనాభా లెక్కల వివరాలతోనే..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33% రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. రాజ్యాంగ అధికరణలు 170(3), 81(3) ప్రకారం.. 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందువల్ల కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తేనుంది ఇదివరకు భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తికానుండటంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపటొచ్చు. ఈ అంశంపై అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం. ప్రభుత్వ ప్రతిపాదనపై స్పందించడానికి రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మంగళవారం విపక్షనేతలు సమావేశం కానున్నారు.

# కొత్త చరిత్ర సృష్టిస్తుందా?

కోల్‌కతా

రాజకీయ చైతన్యానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు ప్రతీకలు. అటువంటి రాష్ట్రానికే దిక్సూచీ వంటి నియోజకవర్గాల్లో అత్యంత కీలకమైనది భవానీపుర్. కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలపాటు కంచుకోటగా ఉన్న ఆ స్థానం...తర్వాత కాలంలో మారిన రాజకీయ పరిణామాలకు సంకేతమా అన్నట్లు తృణమూల్ కాంగ్రెస్‌కు రక్షణ దుర్గంగా మారింది. టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీకి అత్యంత సురక్షితమైన, విశ్వసనీయమైన స్థావరమైంది. అటువంటి కీలక నియోజకవర్గం ఈ దఫా హోరాహోరీ పోరుకు వేదికగా మారనుంది. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తోన్న భాజపా...తమ అగ్రనేత సువేందు అధికారిని మమతపై నేరుగా పోటీకి దించాలని నిర్ణయించడంతో ఈసారి అందరి దృష్టి భవానీపుర్‌పైనే కేంద్రీకృతమైంది.

**40ఏళ్ల కనుమరుగు తర్వాత..**

దక్షిణ కోల్‌కతా పరిధి భవానీపుర్‌లో స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు కాంగ్రెస్‌దే హవా. రాష్ట్రంలోని దిగ్గజ నేతలకు సొంత నియోజకవర్గంగా మారింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థశంకర్ రే కాంగ్రెస్ అభ్యర్థిగానూ ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థిగానూ ఇక్కడి నుంచే పోటీ చేశారు. దిగ్గజ కాంగ్రెస్ నేతలైన మీరా దాస్ గుప్తా, రతిన్ తాలూక్దార్ తదితరులు కూడా ఇక్కడి నుంచే అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడంతో ఆ పార్టీకి గట్టిపట్టున్న అర్బన్ నియోజకవర్గాల్లో భవానీపుర్ ఒకటిగా నిలిచింది. ఈ స్థానం పేరును కాళీఘాట్‌గా మార్చిన 1969లో మాత్రమే సీపీఐ(ఎం) అభ్యర్థి సుధాన్ గుప్తా ఇక్కడ గెలుపొందారు. 1972 నియోజకవర్గాల పునర్విభజనతో భవానీపుర్ నాలుగు దశాబ్దాలపాటు రాజకీయ ఉనికిని కోల్పోయింది.

2011లో మళ్లీ నిర్వహించిన నియోజకవర్గాల పునర్విభజనతో తెరపైకి వస్తూనే భవానీపుర్ కొత్త చరిత్ర సృష్టించింది. పశ్చిమ బెంగాల్ రాజకీయాలూ మలుపు తిరిగాయి. వామపక్షాల 34 ఏళ్ల పాలన ముగిసిపోయి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ఆధిపత్యం ప్రారంభమైంది. ఆ పార్టీ వ్యవస్థాపకురాలు మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. తృణమూల్ ఆధిపత్యం ప్రారంభంతో పాటే భవానీపుర్ నియోజకవర్గం పేరూ మార్మోగింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ తరఫున పోటీ చేసిన సుబ్రతా బక్షి 50వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. టీఎంసీకి గట్టిపట్టున్న నియోజకవర్గంగా భవానీపుర్ నిలిచింది. అయితే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోసం ఈ సీటును సుబ్రతా బక్షి ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక జరిగింది. మమతా బెనర్జీ 54వేల ఓట్ల ఆధిక్యంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఈ స్థానం టీఎంసీకి అత్యంత సురక్షితమైన స్థానంగా మారింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేసినా భవానీపుర్‌లో మమతా బెనర్జీ విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. ఈ దఫా మెజారిటీ 65,520 ఓట్లకి పెరగడం విశేషం.

**సామాజిక వైవిధ్యానికి ప్రతీక..**

కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాలు భవానీపుర్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలిచే ఈ స్థానంలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. నందిగ్రామ్‌లో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మమతను ఓడించిన సువేందు అధికారినే ఈ దఫా భవానీపుర్ స్థానంలో భాజపా రంగంలోకి దించడంతో స్థానిక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. గతంలో మాదిరిగా ఇక్కడి ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ చరిత్రను మలుపుతిప్పుతాయా? అనే విషయమై చర్చలు జరుగుతున్నాయి.


**నందిగ్రామ్‌లో ఎదురుదెబ్బతో...**

టీఎంసీని వీడి భాజపాలో చేరిన మాజీ రాజకీయ సహచరుడు సువేందు అధికారికి సవాల్ విసురుతూ మమతా బెనర్జీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో పోటీ చేశారు. భవానీపుర్‌లో టీఎంసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన శోవన్‌దేవ్ ఛటోపాధ్యాయ్ 28వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. నందిగ్రామ్‌లో 1,956 ఓట్ల వ్యత్యాసంతో మమతా బెనర్జీ ఓటమిని చవిచూశారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మమత ఉప ఎన్నికల్లో పోటీ చేయాల్సి రావడంతో మళ్లీ భవానీపుర్ స్థానాన్నే ఎంచుకున్నారు. ఈ దఫా 58వేల ఓట్ల మెజారిటీ సాధించారు.

# ‘ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్’

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు దౌత్యపరమైన చొరవ కోసం స్వయం ప్రకటిత ‘విశ్వగురు’ అయిన భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ సదస్సును ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని కాంగ్రెస్ మండిపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. “ఈ ఏడాది చివర్లో భారత్ అధ్యక్షతన దిల్లీలో 18వ వార్షిక బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఇందులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ సభ్య దేశాలుగా ఉన్నాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని, దాని ప్రభావాలను ఎదుర్కోవడానికి ఒక దౌత్యపరమైన చొరవ తీసుకునేందుకు ఉద్దేశించిన శిఖరాగ్ర సమావేశాన్ని స్వయం ప్రకటిత ‘విశ్వగురు’ అయిన ప్రధాని మోదీ ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? దీన్ని బట్టి మోదీకి యూఎస్ అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను వ్యతిరేకించడం ఇష్టం లేదని స్పష్టంగా అర్థమవుతోంది” అని జైరాం రమేశ్ విమర్శించారు.

పశ్చిమాసియాలోని పరిస్థితులపై చర్చించడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నాయకులకు ఫోన్ కాల్స్ చేస్తున్నారని జైరాం రమేశ్ తెలిపారు. “ఈ సంభాషణలలో మన ఎల్ సుప్రీమోకు (మోదీకి) ఆలింగనాలు ఉండవు. చేతి వేలు ఊపుతూ, జ్ఞానబోధ చేస్తూ ఫొటోలు దిగే అవకాశాలు ఉండవు. అయితే శిఖరాగ్ర సమావేశాల్లో విలువైన



ముఖాముఖి చర్చలు జరపొచ్చు. ఏదైనా సంక్షోభానికి సంబంధించిన నిర్దిష్టమైన చర్యలను తీసుకోవచ్చు. ఈ ఏడాది జీ20కి అమెరికా అధ్యక్షత వహిస్తోంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరిన్ని ఆవేశపూరిత ప్రసంగాలు, ఎగతాళి మాటలు తప్ప ఆ సమ్మిట్ వల్ల చెప్పుకోదగ్గ ఫలితాలేమీ ఉండవు” అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**దౌత్యపరమైన పరిష్కారం కావాలి: మనీశ్ తివారీ**

పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా సరఫరా గొలుసులో ఏర్పడుతున్న అంతరాయాలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి దౌత్యపరమైన పరిష్కారం కావాలని పిలుపునిచ్చారు. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, ఆహారం, ఔషధాల సరఫరా గొలుసు అంతరాయం వల్ల కలిగే పరిణామాలను ప్రస్తావించారు. ఇంధనాన్ని వినియోగించే దేశాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రశ్నలు లేవనెత్తారు.

**‘అక్కడ నిరుపయోగంగా మూడు వేల నౌకలు’**

“పశ్చిమాసియా సంక్షోభం అత్యంత ప్రమాదకరమైన దశలోకి ప్రవేశించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్ , పర్షియన్ గల్ఫ్‌లో 3000 నౌకలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ తమ ఉద్రిక్తతలను తగ్గించుకోవాలి. దౌత్య మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. ఇంధనాన్ని వినియోగించే దేశాల్లో పరిస్థితి అంతకంతకు దిగజారుతోంది. ఎందుకంటే ఇది కేవలం ముడి చమురు, సహజ వాయువుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఎరువులు, ఆహారం, ఔషధాలు, ప్రాణాలను కాపాడే అత్యవసర మందులకు కూడా సంబంధించినది. మొత్తం సరఫరా గొలుసు దెబ్బతింది” అని మనీశ్ తివారీ పేర్కొన్నారు.

**మోదీ అధ్యక్షతన మీటింగ్**

కాగా, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ ప్రధాని మోదీ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై సీనియర్ మంత్రులతో చర్చించారు మోదీ. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ తదితరులు పాల్గొన్నారు. గ్యాస్, పెట్రోల్, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రధాని మోదీ ఆదేశించారు.

## యుద్ధం మానవాళికి శ్రేయం కాదు

దిల్లీ

మానవాళి ప్రయోజనాలకు యుద్ధం ఏమాత్రం శ్రేయం కాదని, అందువల్ల శాంతియుత పరిష్కారం వైపు ఆయా పక్షాలను ప్రోత్సహించేలా మనదేశం ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. “మనది ఎప్పుడూ శాంతి మార్గమే. సమస్యకు పరిష్కారం– చర్చలు, దౌత్యమే. ఉద్రిక్తతలను, పశ్చిమాసియాలో ఘర్షణను తగ్గించడం ధ్యేయంగా మనం కృషి చేస్తున్నాం” అని సోమవారం లోక్‌సభలో ఆయనొక ప్రకటన చేశారు. వాణిజ్య నౌకలపై దాడులు, హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలకు అవాంతరం కలిగించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు. ఆ ప్రాంతం మీదుగా నౌకలు రావడం ఎంతో సవాల్‌గా మారినా తమ ప్రభుత్వ ప్రయత్నాలతో పెద్దగా అవాంతరం లేకుండా ఇంధనాలు సరఫరా అవుతున్నాయని చెప్పారు. సాధారణ కుటుంబాలవారు అతితక్కువ ఇబ్బందితో బయటపడేలాచేసే చర్యలన్నీ చేపట్టినట్లు తెలిపారు. చమురు, గ్యాస్ అవసరాలు తీర్చేందుకు వేర్వేరు దేశాల సరఫరాదారులతో ప్రభుత్వం సంప్రదింపులు సాగిస్తోందని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లోని భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంతమేర సాయం అందిస్తున్నామని తెలిపారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడినుంచి స్వదేశానికి చేరుకున్నారని చెప్పారు.

**ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం**

“యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయి. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ఇదివరకు 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. గత 11 ఏళ్లలో ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా కృషి చేస్తున్నాం. అన్ని విద్యుదుత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు సరిపడా ఉన్నాయి. ఆహారభద్రత పరంగానూ సన్నద్ధతతో ఉన్నాం. మన రైతులు ధాన్యాగారాలన్నీ ఇప్పటికే నింపేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ నౌకలు సురక్షితంగా తిరిగేలా చూసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటిమంది భారతీయులు ఉంటున్నందువల్ల పశ్చిమాసియా మనకెంతో ముఖ్యమైనది. అందువల్ల ప్రస్తుత ఘర్షణ ఆందోళనకరమే. పార్లమెంటు ద్వారా మన ఏకాభిప్రాయాన్ని ప్రపంచానికి చేర్చాల్సిన ఆవశ్యకత ఉంది” అని మోదీ తెలిపారు.

**డైలాగులే తప్ప కొత్త అంశాల్లేవు: ప్రియాంక**

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పే చర్చలకు మన దేశం నేతృత్వం వహించాలని కాంగ్రెస్ సూచించింది. దేశంలో ఎల్పీజీ కొరత, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఏం చేస్తున్నారో ప్రధాని ఇప్పటికే చెప్పి ఉండాల్సిందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ పార్లమెంటు వెలుపల విలేకరులతో అన్నారు. ఆయన ప్రకటనలో డైలాగులే తప్ప కొత్త అంశాలేమీ లేవని చెప్పారు. 14 రోజుల మౌనం తర్వాత ప్రధానికి ఇప్పటికి తీరిక దొరికినట్లుందని లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ విమర్శించారు.

# డీఎంకేదే అధికారం

త్వరలో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమి ప్రభంజనం సృష్టించనుందని చెన్నై కేంద్రంగా పనిచేసే ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అనే సర్వే సంస్థ తేల్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 44.9శాతం ఓట్లను సాధిస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో 180 స్థానాలను అధికార కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. విపక్ష అన్నాడీఎంకే కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తగలనుందని సర్వే సంస్థ వెల్లడించింది. ఈ కూటమి 38.5శాతం ఓట్లను సాధించి, 54 సీట్లకే పరిమితమయ్యే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది.

అన్నాడీఎంకేకి షాక్!

అన్నాడీఎంకే కూటమికి ఈ ఎన్నికల్లో చెన్నై రీజియన్‌లో ఎదురుదెబ్బ తగలనున్నట్లు ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అనే సర్వే సంస్థ అంచనా వేసింది. ఆ ప్రాంతంలో ఒక్క సీటు కూడా అన్నాడీఎంకే కూటమి గెలవదని పేర్కొంది. మధ్య తమిళనాడు ప్రాంతంలో పళనిస్వామి నేతృత్వంలో కూటమి కేవలం 2 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని వెల్లడించింది. దీంతో అన్నాడీఎంకే కూటమి మరోసారి భారీ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

టీవీకే ప్రభావం అంతంతమాత్రమే!

సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో అంతంతమాత్రమే ప్రభావితం చూపిస్తుందని సర్వే సంస్థ ‘అగ్ని న్యూస్ సర్వీస్’ అంచనా వేసింది. 9.7శాతం ఓట్లను టీవీకే సాధిస్తుందని వెల్లడించింది. అలాగే, సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కచ్చి పార్టీ 4.8శాతం ఓట్ల వాటాను పొందే ఛాన్స్ ఉందని, ఇతర పార్టీలు కలిపి 2.1శాతం ఓట్లను దక్కించుకుంటాయని సర్వే సంస్థ పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్, నామ్ తమిళర్ కచ్చి పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ ఇద్దరూ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని అంచనా వేసింది.

# ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం

అమెరికా–ఇజ్రాయెల్ కలిసి ఇరాన్?పై దాడి చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీకార దాడులతో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ దాడుల వల్ల ఇరాన్?లోని చాలా ప్రాంతాలు దెబ్బతిన్నాయి. పాఠశాలలు, భవనాలు, ఆస్పత్రులు ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది నిరాశ్రయులు అయ్యారు. ఈ క్రమంలో ఇరాన్?కు జమ్ముకశ్మీర్?లోని ప్రజలు భారీ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. నగదు, బంగారు ఆభరణాలు, రాగి పాత్రలు వంటి పంపించారు. ఇందుకు భారత్?లోని ఇరాన్ రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు సహాయం చేయడానికి కశ్మీర్ ప్రజలు పెద్ద ఎత్తున విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా షియాలు అధికంగా ఉన్న బుద్గామ్, బారాముల్లా జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. రంజాన్ మరుసటి రోజు ఆదివారం భారీ విరాళాలు వచ్చాయి. ప్రజలు నగదు మాత్రమే కాకుండా బంగారు ఆభరణాలు, పశువులు, సంప్రదాయ రాగి పాత్రలు వంటి విలువైన వస్తువులను కూడా విరాళంగా అందించారు.

ఇంటింటికీ వెళ్లి సేకరణ

ఇరానీయులకు సాయం చేసేందుకు ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో పిల్లల దగ్గర నుంచి పెద్ద వరకు, మహిళలు, పురుషులు అందురు పాల్గొన్నారు. మహిళలు తమ బంగారు ఆభరణాలను విరాళంగా ఇచ్చారు. అలాగే ఇళ్లలోని విలువైన వస్తువులను, కొందరు తమ పశువులను కూడా సాయంగా ఇచ్చారు. పిల్లలు సైతం తమ పొదుపు నగదును, ఈద్ సందర్భంగా పొందిన డబ్బును ఇచ్చారు.

‘వారికి సాయం చేయడం మన బాధ్యత’

ఇరాన్? ప్రజలకు సాయం చేయడానికి ఈ విరాళాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీనగర్?లోని రైనావారి ప్రాంతానికి చెందిన అజాబ్? అహ్మద్ ఓ వార్త సంస్థకు తెలిపారు. ఈ యుద్ధం వల్ల ఇరాన్?లో భారీ విధ్వంసం జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల బాధపడుతున్న ప్రజలకు సహాయం మన బాధ్యత అని చెప్పారు.


**ఇరాన్ ఎంబసీ కృతజ్ఞతలు**

ఇది కేవలం సాయం మాత్రమే కాదని భావోద్వేగ అనుబంధాన్ని కూడా చూపించిందని భారత్?లోని ఇరాన్ రాయబార? కార్యాలయం పేర్కొంది. విరాళాల ఫొటోలను పంచుకుంటూ ఎక్స్?లో పోస్ట్ చేసింది. కశ్మీర్ ప్రజల మానవత్వం, సాయం తమకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంది. కశ్మీర్? ప్రజలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పింది.

తీన్మార్
తెలంగాణ దిన పత్రిక

# ప్రపంచాన్ని వణికిస్తున్న చమురు మంటలు

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక–రాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను “త్వరగా ముగిసే పరిమిత యుద్ధం”గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో “అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?” అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం “శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం” అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు “మ్యాక్సిమమ్ ప్రెషర్” విధానం? కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని “తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం” అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం. కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది అమెరికా మొదట భావించిన కీలక అంచనా?ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో “బాహ్య శత్రువు” భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ. అమెరికా మరో పెద్ద పొరపాటు?ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, “త్వరగా ముగుస్తుంది” అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది. చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు ఽ70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు ఽ100?ఽ113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది.    ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది. అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే “టెరర్ ప్రీమియం” తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది?మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి. మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల?కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది?అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు “అమెరికా నిర్ణయాల భారం” మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి? కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ “మల్టీ–లేయర్డ్ వార్ స్ట్రాటజీ”ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది. ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది?త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవదినాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది?చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం. ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.అందువల్ల “అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?” అనే ప్రశ్నకు సమాధానం?అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ



# క్షయపై ఉన్న అపోహలను పారద్రోలాలి



ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24 న నిర్వహిస్తారు. భయంకర మైన అంటు వ్యాధైన టీబీ (క్షయ) దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు 1000 మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 నుండి క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది.1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మ క్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటి సారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 120 సంవత్సరాలు కావస్తున్నాయి. ఐరోపాలో క్షయ బ్యాక్టీరియా 7 వేల ఏళ్ల క్రితమే మనుగడ సాగించినట్లు, అత్యంత ప్రాచీన క్షయ కేసు 7వేల ఏళ్ళ క్రితమే ఉన్నట్లు స్జెగెడ్ విశ్వ విద్యాలయానికి చెందిన పరిశోధకులు మురియెల్ మాసన్ పరిశోధనలో వెల్లడైంది. హైపర్ ట్రోఫిక్ పల్మనరీ ఆస్టియోపతి (హెచ్‌పీవో) అనే వ్యాధికి వేల సంవత్సరాల క్రితం క్షయ కారణమనీ, పురావస్తు రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా పరిశోధకులు దక్షిణ హంగరీలో ఏడువేల సంవత్సరాల క్రితంనాటి ప్రదేశంలో 71 మానవ అస్థిపంజరాలను పరీక్షించారు. వీటి ఆధారంగా ఇన్ఫెక్షన్లు, జీవక్రియ సంబంధ వ్యాధులకు సంబంధించి పలు కేసులను గుర్తించారు. కొన్ని అస్థిపంజరాల్లో హెచ్‌పీవోకు సంబంధించిన సంకేతాలు కూడా గుర్తించడంతో క్షయ అప్పట్లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం ప్రపంచంలో మూడొంతుల మంది క్షయ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారు. టీబీ కారణంగా ఇండియాలో ఏటా 4,80,000 మరణాలు సంభవిస్తున్నాయి. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం క్షయ కారణంగా దేశంలో రోజుకి 1,300 మంది చనిపోతున్నారు. గత 50 ఏళ్లుగా టీబీని నివారించేందుకు ఇండియా పోరాటం చేస్తున్నప్పటికీ అది అంతం కావడం లేదు. అందుకే ఇప్పటికీ దీన్ని ‘సైలెంట్ కిల్లర్’ అని పిలుస్తున్నారు. క్షయ అనగానే దగ్గు గుర్తుకు రావడం సహజం, తద్వారా కేవలం ఊపిరి తిత్తులకు మాత్రమే క్షయ వ్యాధి కలుగుతుందని అనేకమంది భావిస్తుంటారు. కానీ క్షయ వ్యాధి అనేది, శరీరంలో ఏ భాగానికైనా రావొచ్చు. చర్మం, గర్భాశయం మొదలైనవి. అదే విధంగా మెదడుకు కూడా క్షయవ్యాధి సోకుతుంది. తద్వారా మెదడులోని రక్తనాళాలు వాపునకు గురవడం జరుగుతుంది. దీనిని మెనింజైటిస్ క్షయ వ్యాధిగా కూడా పిలుస్తారు.క్షయ రోగాన్ని ఒకప్పుడు ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణించే వారు. కానీ క్రమేపీ దాన్ని నిరోధించటం, నివారించటం మొదలైంది. మైకో బాక్టీరియం క్షయ అనే బ్యాక్టీరియా వల్ల క్షయవ్యాధి వస్తుంది. ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. అయితే ఇది శరీరంలోని ఏదైనా అవయవానికి కలిగి ఉంటుంది. క్షయ అనేది నయం చేయగల మరియు నివారించగల వ్యాధి. ఊపిరితిత్తుల టిబి దగ్గు, తుమ్ము లేదా బిందువుల ద్వారా ఉమ్మివేసినప్పుడు ఇది వ్యక్తి నుండి వ్యక్తికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. టిబి ఉన్న వ్యక్తి దగ్గు, నిరీక్షణ, హిమోప్టిసిస్, జ్వరం, రాత్రి చెమటలు, ఆకలి లేకపోవడం లేదా 2 వారాల కన్నా ఎక్కువ బరువు తగ్గడం వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. క్షయవ్యాధి నిర్ధారణ మరియు చికిత్స పూర్తిగా ఉచితం మరియు జాతీయ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రామర్ (ఎన్‌టిఇపి) చేత సమన్వయం చేయబడుతుంది. మెదడు క్షయ వ్యాధి కారకాలు ప్రధాననీగా...ఎక్కువ మద్యం సేవించడం, ఎయిడ్స్, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం, డయాబెటిస్ మెల్లిటస్ (రక్తంలో చక్కర నిల్వలు అమాంతం పెరిగి పోవడం, ఇన్సులిన్ స్థాయిలు హీనంగా తగ్గిపోవడం) తదితరాలు కారకాలుగా ఉంటాయి.సాధారణంగా ఎక్స్–రే, గళ్ళ పరీక్షలతో 60% నుంచి 70 శాతం కేసుల్లో టి.బి అని నిర్ధారించవచ్చు. వీటితో నిర్ధారణ కాకపోతే అప్పుడు సెరోలజీ, పీసీఆర్, మాంలో వంట్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఇవేగాక అవసరాన్ని బట్టి సీటీస్కాన్, టోన్స్కాన్, బయాప్సీ వంటి పరీక్షలు చేయించాలి. మెదడు క్షయ వ్యాధిని తగ్గించుకునే చికిత్సలో ప్రధాన భాగం ఆహార ప్రణాళికలలో మార్పులు చేయడమే. శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలు పెరిగే కొలదీ, రోగాన్ని ఎదుర్కొనే శక్తిని శరీరనీ పొందగలదు. కావున ఈ వ్యాధికి గురైన వారు తమ ఆహార ప్రణాళికలో తాజా పండ్లు, కాయగూరలు, మరియు ఆరోగ్యకర ప్రోటీన్ నిల్వలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు డైటీషియన్ సలహా మేరకు తీసుకొనవలసి ఉంటుంది. తద్వారా త్వరగా కోలుకునే అవకాశనీ ఉన్నది. మెనింజెటిస్ క్షయ వ్యాధి సమస్యలు అత్యంత జఠిలనీ గా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం కూడా కావొచ్చు. చికిత్సా సమయంలో ముఖ్యంగా పండ్లనే ఎక్కువ తీసుకొనవలసి ఉంటుంది. చికిత్స పూర్తయిన తర్వాత డాక్టర్ సలహా మేరకు పాలను కూడా తీసుకొనవచ్చు.పాలలో అత్యధిక మోతాదులో కాల్షియం నిల్వలు ఉంటాయి, కావున మెదడు క్షయ వ్యాధికి గురైన వారికి మంచి ఆహారంగా సూచించ బడుతుంది. క్షయ వ్యాధి ఉన్న రోగి దగ్గినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. క్షయ వ్యాధి గ్రస్తుడు దగ్గినపుడు, అతని ఊపిరితిత్తుల నుండి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతమైన మనిషి పీల్చే గాలితోపాటు అతని ఊపిరితిత్తుల లోనికి ప్రవేశించి జబ్బుకు పునాది వేస్తుంది. కనుక వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, ఇళ్లలో గాలి, వెలుతురు మొదలైనవి బాగా ఉండేలా చూసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి. ఎక్కడపడితే అక్కడ ఉమ్మేయ కూడదు. ఉమ్మి వేయడానికి మూత ఉన్న కప్పు ఉప యోగించాలి. మంచి పోషకాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప జేసుకోవాలి. 2025 నాటికి టిబిని అరికట్టడం లక్ష్యంగా చికిత్స మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. దీర్ఘకాలిక సీక్వెల్ ప్రారంభ రోగ నిర్ధారణ మరియు చికిత్స ద్వారా నివారించవచ్చు. క్షయవ్యాధి చికిత్స, వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా ఆరోగ్య కేంద్రాలలోనే అందు బాటులో ఉన్నాయి. ప్రస్తుతం రివైజ్డ్ టి.బి. కంట్రోలు ప్రోగ్రాంను ప్రభుత్వం అమలు పరుస్తోంది. క్రమం తప్పకుండా పూర్తి మోతాదులో మందులు వేసుకున్నట్టయితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసు కోవచ్చు. క్షయరోగి క్రమం తప్పకుండా, ఆపకుండా కనీసం ఆరునెలలపాటు మందులు వేసుకొనవలసి ఉంటుంది. కొంతమంది రోగులకు ఒక సంవత్సరం పాటు మందులు ఇవ్వవలసి ఉంటుంది. వైద్యులను సంప్రదించిన తరువాతనే వారి సలహా మేరకు మాత్రమే మందులు వేసుకొనడం ఆపివేయాలి.

# జగదీశ్వర్ గానయాత్రకు నంది గౌరవం



జగదీశ్వర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించడం తెలుగు గాన ప్రపంచానికి గర్వకారణమైన ఘట్టంగా నిలిచింది. గాత్రంలో గంభీరత, స్వరంలో సౌందర్యం, భావ ప్రకటనలో ఆవేశం?ఈ మూడు లక్షణాల సమన్వయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న గాయకుల్లో డా. గుండి జగదీశ్వర్ శర్మ ఒక విశిష్ట ప్రతిభ. తెలంగాణ భూమిలోని ఆధ్యాత్మిక క్షేత్రాల వైభవాన్ని తన గాత్రంలో మలచి, భక్తి, జానపదం, శాస్త్రీయతల సమ్మేళనంతో గానయాత్ర సాగిస్తున్న ఆయనకు లభించిన ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా తెలుగు సంగీత సంప్రదాయానికి లభించిన మరొక గౌరవంగా చెప్పుకోవాలి.పవిత్ర గోదావరి నది తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రం, దక్షిణ కాశీగా, నవనరసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన ఆధ్యాత్మిక ప్రదేశం. హరిహరులు, బ్రహ్మతో కూడిన త్రిమూర్తుల క్షేత్రంగా ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతంలో గుండి హరిప్రియ, హన్మాండ్లు దంపతులకు జన్మించిన జగదీశ్వర్ శర్మ బాల్యంలోనే సంగీతం పట్ల సహజమైన ఆకర్షణను ప్రదర్శించారు. భక్తి వాతావరణంలో పెరిగిన ఆయనకు స్వరాలంటే పూజా విధానంలా మారింది. చిన్ననాటి నుంచే సాధనను జీవిత భాగంగా చేసుకొని, గురువుల మార్గదర్శకత్వంలో స్వర సాధనను క్రమబద్ధంగా అభ్యసిస్తూ, తన గాత్రాన్ని మెరుగు పరచుకున్నారు. ఈ క్రమశిక్షణే ఆయనను గాత్ర సరస్వతిగా తీర్చిదిద్దింది. సంగీత రంగంలో అడుగుపెట్టిన ప్రారంభ దశల నుంచే ఆయన ప్రతిభ ప్రస్ఫుటమైంది. రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా తన గాత్రాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, తెలుగు గాన ప్రపంచంలో తన ప్రత్యేక గుర్తింపును స్థిరపరచు కున్నారు. ముఖ్యంగా ఈటీవీలో ప్రసారమైన ‘పాడుతా తీయగా’ కార్యక్రమంలో పాల్గొనడం ఆయన జీవితంలో కీలకమలుపుగా నిలిచింది. గానగంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో తన గాత్రాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన ప్రతిభకు విశేషమైన గుర్తింపు లభించింది. అదే విధంగా జెమినీ టీవీలోని ‘నవరాగం’ సంగీత పోటీలో సెమీఫైనల్ వరకు చేరుకోవడం ద్వారా, ప్రముఖ గాయకుల ప్రశంసలు పొందిన తొలి తెలంగాణ గాయకుడిగా గుర్తింపు సంపాదించారు. అయితే ఆయన ప్రయాణం టెలివిజన్ కార్యక్రమాలతో మాత్రమే పరిమితం కాలేదు. సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పి. పాట్నాయక్ వంటి ప్రముఖులతో కలిసి ఆర్కెస్ట్రా ప్రదర్శనల్లో పాల్గొని, వారి ప్రశంసలను అందుకున్నారు. ఈ అనుభవం ఆయన గాన శైలిలో మరింత నైపుణ్యాన్ని, వైవిధ్యాన్ని తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 1600కు పైగా సంగీత విభావరులను నిర్వహించడం ఆయనకు ఒక అరుదైన ఘనత. ఈ కార్యక్రమాలు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించి, ఆయన గాత్రాన్ని విభిన్న వేదికలపై వినిపించాయి. ప్రతి ప్రదర్శనలోనూ శ్రోతల హృదయాలను హత్తుకునే గాత్రమాధుర్యం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానానికి లభించిన అవార్డులు ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇప్పటి వరకు 130కి పైగా అవార్డులు అందుకోవడం ద్వారా ఆయన తన స్థానాన్ని మరింత బలపరచు కున్నారు. ముఖ్యంగా ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పేరుతో మూడు సార్లు, ఘంటసాల పేరుతో రెండు సార్లు అవార్డులు పొందడం ఆయన గాన ప్రతిభకు అద్దం పడుతుంది. తెలంగాణ రత్న, ప్రతిభా రత్న వంటి బహుమతులు ఆయనకు లభించడం ఆయనకు ఉన్న ప్రజాదరణను తెలియ జేస్తుంది. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నుంచి జాతీయ స్థాయిలో ‘బెస్ట్ సింగర్’గా అవార్డు పొందడం ఆయన గానానికి దేశవ్యాప్తంగా లభించిన గుర్తింపు. అంతేకాకుండా, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్‌లలో ‘బెస్ట్ సింగర్’గా స్థానం పొందడం ఆయన ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తీసుకొచ్చింది.2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఆయన గానసేవకు లభించిన అత్యున్నత గౌరవాల్లో ఒకటి. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందుకోవడం ఆయన జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచింది. ఇది ఆయన వ్యక్తిగత విజయమే కాకుం డా తెలంగాణ గాన సంప్రదాయానికి లభించిన గౌరవంగా చెప్పుకోవచ్చు.భక్తి, ఆధ్యాత్మికత, జానపద సంప్రదాయాల మేళవింపుతో ఆయన గానయాత్ర కొనసాగుతోంది. 100కు పైగా ఆడియో సీడీలలో పాల్గొని, వినాయక భక్తి గీతాలు, శ్రీరామ భజనలు, ఆంజనేయ స్తోత్రాలు, జానపద గీతాలు వంటి అనేక గాన రూపాలను ప్రజలకు అందించారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి శతకాలకు ఆయన గాత్రం అందించడం ద్వారా ఆధ్యాత్మిక గానానికి కొత్త పరిమాణాన్ని ఇచ్చారు. ప్రతి గానంలోనూ భక్తి భావాన్ని ప్రతిబింబింపజేసే ఆయన గాత్రం శ్రోతలకు ఆత్మీయ అనుభూతిని కలిగిస్తుంది. సంగీతాన్ని ఆయన కేవలం వృత్తిగా కాకుండా జీవనపథంగా భావించడం ఆయన ప్రత్యేకత. ప్రతి పాటను పూజార్చనగా భావిస్తూ, శ్రద్ధతో, భక్తితో ఆలపించడం ఆయన గానశైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధానం ఆయనను సాధారణ గాయకుడిగా కాకుండా ఆధ్యాత్మిక గాయకుడిగా నిలబెట్టింది. భక్తి, సామాజిక చైతన్యం, సంగీత వైవిధ్యాల సమ్మేళనంతో ఆయన గాన ప్రస్థానం ఒక ఆదర్శంగా నిలుస్తోంది.ఇటీవల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో స్వర మాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం ప్రదానం చేయడం విశేషం. వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, ఆస్ట్రేలియాలోని వ్యాపారి శేష చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం ఆయన గాన ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. 28 సంవత్సరాల సంగీత ప్రయాణంలో ఇది ఆయనకు లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం ప్రత్యేకత. ఈ అవార్డుతో కలిపి ఆయన అందుకున్న మొత్తం అవార్డుల సంఖ్య 135కు చేరుకోవడం ఆయన సాధనకు ప్రతీకగా నిలుస్తోంది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం మాత్రమే కాదు; అది ఒక సంస్కృతి, ఒక సంప్రదాయం, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. ఆయన గాత్రం ద్వారా భక్తి పరంపర కొనసాగుతూనే ఉంది. భవిష్యత్ తరాలకు ఆయన ఒక ప్రేరణగా నిలుస్తున్నారు. సాధన, పట్టుదల, వినయం?ఈ మూడు గుణాలు కలిసినపుడే గొప్పతనం సాధ్యమవుతుందని ఆయన జీవితమే స్పష్టంగా చెబుతోంది. తెలుగు గాన ప్రపంచంలో ఆయన స్థానం మరింత ఎత్తుకు ఎదగాలని, ఆయన గాత్రం మరిన్ని హృదయాలను హత్తాలని ఆకాంక్షించాలి.

# వేణు ఊడుగులను సన్మానించిన ఉప్పరపల్లి గ్రామస్తులు

## లంబాడీ పల్లెలాగా.. ఉప్పరపల్లి చేస్తా : వేణు ఊడుగుల



**హైదరాబాద్ మార్చి 23 (తీన్మార్ న్యూస్):**

ఇటీవల కాలంలో రాజు వెడ్స్ రాంబాయి మూవీ ని నిర్మించి విజయం సాధించి,తెలంగాణ ఉత్తమ సినిమా గద్దర్ అవార్డ్ సాధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డ్ అందుకున్న సందర్భంగా ఉప్పరపల్లి ప్రజలు, పెద్దలు యువకులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రస్తుత సర్పంచ్ చిలపాక మొగిలి,మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్, ఊడుగుల శ్రీనివాస్ లతో పాటు గ్రామ ప్రజలు బంధువులు పాల్గొని వేణు ఊడుగులను హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లో వారి కార్యాలయం లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి కష్టపడి ఈ స్థాయికి ఎదిగిన వేణు ఊడుగుల పలువురికి ఆదర్శం అని, ముఖ్యంగా గ్రామ యువకులను సినీ రంగములో ప్రోత్సహించడం అభినందనీయం అని అన్నారు. ప్రస్తుత సర్పంచ్ చిలపాక మొగిలి మాట్లాడుతూ గ్రామానికి సేవ చేయాలనే ఆలోచన వేణు గారికి రావడం సంతోషం అని, వారి తండ్రి కొమ్మాలు మార్గములో వేణు నడవాలని కోరారు. మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాడు గ్రామంలో జరిగే రాములవారి కల్యాణానికి వేణు ఊడుగుల రావాలని ఆహ్వానించగా వారు సమ్మతించారు. చివరగా ముఖ్య అతిథి,సన్మాన గ్రహీత డైరెక్టర్ ప్రొడ్యూసర్ వేణు ఊడుగుల మాట్లాడుతూ గ్రామానికి నా సహకారం ఎల్లవేళల ఉంటుందని, సినీ రంగంలోకి రావాలనుకునే వారికి నా ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని, గ్రామ ప్రజలతో త్వరలోనే సినిమా తీస్తానని, లంబాడిపల్లె గ్రామమే తనకు ఆదర్శం అని ఆ తరహాలోనే ఉప్పరపల్లికి పేరు తీసుకువస్తానని, టాలెంట్ ఉంటే ఇండస్ట్రీ పెద్దలను గ్రామానికి తీసుకురావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలపాక మొగిలి, మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ టీచర్ పులి దేవేందర్, ఊడుగుల శ్రీనివాస్, చింతల శ్యామ్ సుందర్ రెడ్డి భాషమియా, కుక్కల కుమార్, చించెట్టి క్రాంతి, అందే శంకర్, మేరుగు కుమారస్వామి, ఊడుగుల రిషిత్,అనుమాండ్ల మధు, బొబ్బల సృజన్, హైమద్, గుల్లపెల్లి శ్రీనివాస్, పల్లకొండ రవి, పల్లకొండ ఎల్లస్వామి, శ్రీనివాస్, దామరకొండ రాజు, మధు, ఆరేళ్లి తెలిసిందే లక్ష్మణ్, కౌన్ రెడ్డి వర్షిత్, రాజ్ కుమార్, పులి రంజిత్, రాజు, ఉడుతల రాజు, మంద సందీప్ లతో పాటు గ్రామ ప్రజలు బంధువులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ కోసం అనేక పథకాలు

**వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలి**
**రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు**
**రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్**



**మహబూబాబాద్ జిల్లా, మార్చి 23 (తీన్మార్ న్యూస్):**

సోమవారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన వారు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఇందిరమ్మ ప్రభుత్వమని, రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వరి పంటనే కాకుండా వాణిజ్య పంటల వైపు రైతులను మళ్ళించే విధంగా వారికి అవగాహన కల్పించాలని అధిక లాభాలు కలిగిన ఆయిల్ పామ్, అంతర్ పంటల వేయడం ద్వారా రైతులు మరింత ముందుకు సాగుతారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సారవంతమైన నేలలు ఉన్నాయని అందుకు తగిన విధంగా పంటలు వేయాలని హార్టికల్చర్, అగ్రికల్చర్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి వారికి అవగాహన కల్పించాలన్నారు. గిరిజన జిల్లా అయిన మహబూబాబాద్ లో క్షణిక ఆవేశంతో గడ్డి మందు సేవించి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తొందరపాటు నిర్ణయాల వలన వారి జీవితాలను అగమ్య గోచరంలో వేసుకోవడం జరుగుతుందన్నారు. గడ్డి మందు నివారణకు కోసం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ ని కలిసి కోరడం జరిగిందని అన్నారు. వివిధ కారణాల వలన ఆర్థికంగా నష్టపోయిన రైతు కుటుంబాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ చేదోడువాదోడుగా ఉందని అన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువుల ఉత్పత్తికి సంబంధించి ఫర్టిలైజర్ షాపులు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతు భరోసా, రైతు బీమా, పెట్టుబడి సహాయం, సన్నవడ్లకు 500 బోనస్, తదితర పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ దేశానికి రైతు ఆదర్శమని రైతుకు సంబంధించి ఎక్కడ లేని విధంగా వారి సంక్షేమం నిమిత్తం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో చిన్న చిన్న కలహాలు, కుటుంబ సమస్యలతో గడ్డి మందు సేవించి చనిపోవడం జరుగుతుందని, అలాంటి తొందర పాటు నిర్ణయాలు తప్పు అని భావించారు. రైతు, ఎస్సీ, ఎస్టీ బహుజనల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అధిక మోతాదులో ఎరువులు ఫర్టిలైజర్స్ వినియోగిస్తే భూమి యొక్క సారవంతమైన బలాన్ని కోల్పోవడం జరుగుతుందని, తగిన మోతాదులో మాత్రమే ఎరువులను వినియోగించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీ సభ్యుల అభివృద్ధి కోసం ఆర్థిక సహాయాలను మంజూరు చేయడం జరుగుతుందని ఎస్సీ ఎస్టీ కమిషన్, రైతు కమిషన్ సభ్యులు వారి కృషి కోసం నిత్యం అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో డిఏఓ సరిత, హార్టికల్చర్ అధికారి మరియన్న, జిల్లా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, ఏ డి ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ

**భూపాలపల్లి, మార్చి 23 (తీన్మార్ న్యూస్):**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మరియు జిల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం అంబేద్కర్ కూడలిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో 136 బీసీ కులాలు ఉండగా, సుమారు 65% జనాభా ఉన్న బీసీల కోసం కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. బీసీల జనాభా శాతాన్ని అనుసరించి కనీసం 51శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఆరోగ్య శాఖకు 4.1శాతం, విద్యా శాఖకు 8.1శాతం మాత్రమే కేటాయించడం దురదృష్టకరమని, ఈ రెండు రంగాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను, ప్రస్తుతం లక్షల కోట్ల అప్పులతో నడిపిస్తూ వడ్డీల రూపంలో భారీ భారం మోపుతున్నారని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు చెల్లించడానికే పెద్ద మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా, కేవలం లెక్కల పరంగా మాత్రమే చూపిస్తూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదని, 16 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురు మాత్రమే బీసీ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. అదే సమయంలో తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం అన్యాయమని అన్నారు. తెలంగాణలో సంపద సృష్టించేది బీసీలేనని, కానీ అధికారంలో మాత్రం వారికి తగిన భాగస్వామ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. 2028లో టిఆర్పి పార్టీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, సత్వర న్యాయం ప్రధాన అజెండాగా తీసుకుని, ప్రతి వర్గానికి వారి హక్కు మేర బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రతి సంవత్సరం కనీసం రూ. 20,000 కోట్లు బీసీల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, రేగొండ మండల మహిళా అధ్యక్షురాలు అనిత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి సునీల్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా కోఆర్డినేటర్ మామిడి శ్రీకాంత్, జిల్లా కోశాధికారి జిలకర శ్రీను, సోషల్ మీడియా ఇంచార్జ్ శ్రీకాంత్, జిల్లా నాయకులు మడే సంతోష్, ఇనుగాల ప్రణీత్, లక్ష్మణ్ అల్లం రామ్ చరణ్ కృష్ణ మనోహర్ రావు, మేనం సంతోష్, మడే సతీష్, భువనగిరి రాజేష్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లలో ఆలస్యం వద్దు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 23 (తీన్మార్ న్యూస్):**

కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1వ తేది వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయరాదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనులపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించిన అన్ని పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల నిర్వహించిన సమావేశంలో అధికారులే ఎప్పటి వరకు పనులు పూర్తి చేస్తారో డెడ్‌లైన్ ఇచ్చారని, అట్టి డెడ్ లైన్ ప్రకారం జాప్యం లేకుండా కచ్చితంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా మహాదేవపూర్ వద్ద ఆర్చ్ నిర్మాణ పనులు పురోగతిపై దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చిన సమాధానంపై ఏప్రిల్ 30వ తేదీ లోపు పూర్తి చేయాలని, ఏం చేస్తారో నాకు సంబంధం లేదు, ఇచ్చిన టైమ్‌లైన్ ప్రకారం పనులు పూర్తి కావాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని గుర్తించిన పార్కింగ్ స్థలాలలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, వైద్య, ఇరిగేషన్, దేవాదాయ, విద్యుత్తు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 23 (తీన్మార్ న్యూస్):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 55 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ కూని చేస్తుంది

**విష్ణు యాదవ్**

**కొత్తపల్లి గోరి, మార్చి 23 (తీన్మార్ న్యూస్):**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలో బిజెపి నాయకులను అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాము, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావు పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్ కి తరలించారు. కాగా బీజేపీ మండల అధ్యక్షుడు సుధనబోయిన విష్ణు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం బీజేపీ పార్టీ ఎల్లప్పుడూ ఉద్యమిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల కోసం బీజేపీ ప్రశ్నిస్తూనే ఉంటుందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నాటకాలు ఆడుతుందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో మండల సీనియర్ నాయకులు కరాబ్ బాబురావు, నెల్లి వేణు,వంగరీ రాంబాబు, జోరు వీరేశం,దొంతుల నరేష్ తదితరులున్నారు

# గిరివాణికి ఫిర్యాదుల వెల్లువ

**అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి**
**భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్డిసి కోర్టు నిర్వహణ**
**జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, మార్చి 23 (తీన్మార్ న్యూస్):
గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించిన గిరివాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం లో స్వయంగా ప్రజల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్వీకరించారు. గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమానికి 130,
**ప్రజావాణి కార్యక్రమానికి 52**
ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు ప్రధానంగా తమ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, కొత్త బోర్వెల్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో బోర్ వెల్స్ ఏర్పాటు వంటి పలు అంశాలపై తమ అర్జీలను సమర్పించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. భూ సమస్యలు ఎల్టిఆర్ కేసుల పురోగతి అభ్యంతరాలపై ప్రజల నుండి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని వాటిని సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా భూ వివాదాల పరిష్కారం కోసం ఎస్‌డిసి కోర్టును వారానికి నాలుగు రోజులు మంగళ, బుధ, గురు, శుక్రవారాలు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఏర్పాటు చేయడం జరుతుందని తెలిపారు. ప్రజలు కోరిన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉపాధి హామీ పథకం నిధులు, ఇతర నిధులను ఉపయోగిస్తూ ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఏ పి ఓ వసంత రావు, ఆర్డీఓ వెంకటేష్, ఎస్ డి సి ప్రతాప్, డి డి జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ఐటిడిఏ ఎస్ ఓ, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, ఎం పి ఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

**బడ్జెట్లో ఐదువేల కోట్లు కేటాయించాలి**
**కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రవిగౌడ్**




ములుగు, మార్చి 23 (తీన్మార్ న్యూస్):
ఎన్నికల ముందు కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని ఆ హామీల్లో ఏ ఒక్క హామీకూడ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని వారు అన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన 97 కోట్ల రూపాయల కేవలం 17 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగతా 79 కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా ఉన్నాయని వారన్నారు అవి ఈ నెలాఖరులోగా ఖర్చు చేస్తేనే ఉపయోగపడతాయని లేకుంటే లాప్స్ అయ్యే అవకాశం ఉందని కాబట్టి తక్షణమే ఆ డబ్బులను కల్లుగీత కార్మిక సంక్షేమానికి ఖర్చు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 2026/27 బడ్జెట్లో కల్లు గీత కార్మిక సంక్షేమ రంగానికి 5000 కోట్లు కేటాయించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలో తాళ్ళు ఎక్కుతున్న కల్లు గీత కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా వృత్తి పింఛన్ ఇవ్వాలని తాడి చెట్ల పెంపకానికి భూమి కొనుగోలు పథకం కింద 10 ఎకరాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న 11 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని కొత్తగా 10 లక్షల జీవో జారీచేయాలని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు రంగు సత్యనారాయణ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రుద్రబోయిన మల్లేశం గౌడ్, గోవిందరావు పేట మండల కార్యదర్శి వత్సవాయి సారయ్య, తాడ్వాయి మండల కార్యదర్శి తిర్రి సంపత్ గౌడ్,ములుగు మండల కార్యదర్శి మునిగాల సురేష్ గౌడ్, వెంకటాపూర్ మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు పులిరమేష్ గౌడ్, ఏటూరునాగారం మండలకార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు చిక్కా అశోక్ గౌడ్ , గుండెబోయిన శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుడి వెనుక ఆసాములు.. గుట్టనే మింగారు!

**ఆసాముల చెరలో.. వేణుగోపాల స్వామి గుట్ట**
**కబ్జాకోరుల కబంధ హస్తాల్లో వేణుగోపాల స్వామి గుట్ట**
**గుట్ట పక్కనే ఉన్న రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాహా**
**పట్టించుకోని అధికారులు**



**వేములపల్లి :** వందల సంవత్సరాల చరిత్ర గల శ్రీ వేణుగోపాలస్వామి గుట్ట కబ్జాకోరుల పాలవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. వేణుగోపాలస్వామి గుట్ట కబ్జాకు గురై భావితరాలకు చరిత్ర తెలియకుండా పోతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. నార్కట్‌పల్లి–అద్దంకి హైవేను కలుపుతూ శెట్టిపాలెం నుంచి అవంతీపురం వద్ద కోదాడ–విజయవాడ రహదారిని కలుపుతూ సుమారు రూ.70 కోట్లతో మిర్యాలగూడ ఔటర్ బైపాస్ రోడ్డు నిర్మించారు.ఎఆర్‌శీటీఎ ఈ రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు వేణుగోపాలస్వామి గుట్టను తవ్వారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గుట్ట మట్టిని, పెద్ద గుండ్లను రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్నారు. వేణుగోపాలస్వామి గుట్ట చుటూ ?ట ఉన్న ప్రభుత్వ భూమి మూడు సర్వే నంబర్లలో 47 ఎకరాల్లో విస్తరించి ఉంది. 31 సర్వే నంబర్‌లో 18 ఎకరాలు, 81వ సర్వే నంబర్‌లో 20 ఎకరాలు, 82వ సర్వే నంబర్‌లో 9 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కాకతీయు కళా వైభవానికి చిహ్నం**

శతాబ్దాల చరిత్ర కలిగిన వేణుగోపాల స్వామి ఆలయం కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తోంది. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమప్ప ఆలయం వరకు సొరంగం మార్గం నిర్మించారని ప్రచారంలో ఉంది. ఈ సొరంగ మార్గం నుంచి అప్పటి భక్తులు ఎడ్ల బండ్లతో సోమప్పకు చేరుకునే వారని చరిత్ర ఆనవాళ్లు చెబుతున్నాయి.

**అనుమతి లేకుండా గుట్టను తవ్వారు**

వేములపల్లి మండల కేంద్రం నుంచి శెట్టిపాలెం మీదుగా అవంతీపురం వరకు ప్రభుత్వం నాలుగు లేన్ల రోడ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు మొదలుపెట్టింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే వేణుగోపాలస్వామి గుట్టను తవ్వి మట్టిని రోడ్డుకు పోస్తున్నారు. మట్టి తవ్వడంతో పక్కన ఉన్న పొలం యజమానులు గుట్టను కబ్జా చేస్తున్నారు. అధికారులు స్పందించి వేణుగోపాలస్వామి గుట్టను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న రేషన్ డీలర్**

వేణుగోపాలస్వామి గుట్టను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఓ రేషన్ డీలర్ ఆక్రమించినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు రేషన్ డీలర్ రెవెన్యూ కార్యాలయంలోని అధికారులకు, సిబ్బందికి పెద్ద మొత్తంలో ముడుపులు అందజేస్తున్నాడని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

**గుట్టను పరిరక్షించాలి**

శతాబ్దాల చరిత్ర గల వేణుగోపాలస్వామి గుట్టను తవ్వడం దారుణం. దేవాలయ గుట్టను, దీని పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రభుత్వ అనుమతి లేకుండా గుట్టను తవ్వే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. వేణుగోపాలస్వామి గుట్టను కాపాడాలి.

## సామాజిక, ఆర్థిక, సర్వేను పర్యవేక్షణ చేసిన ప్రణాళిక అధికారి




ఏటూరునాగారం, మార్చి 23 (తీన్మార్ న్యూస్):
శంకరాజు పల్లి, ఏటూరునాగారం మండలంలో సోషియో–ఎకనామిక్ సర్వే నిర్వహించడం జరిగింది, ఈ సర్వే అనేది కుటుంబాల, గురించి, ఆదాయం, విద్య, వృత్తి, నివాస స్థితి మరియు జీవన పరిస్థితులపై సమాచారం సేకరించడానికి నిర్వహించే సర్వే. ఇది ప్రభుత్వాలకు సంక్షేమ పథకాలు మరియు విధానాలను రూపొందించడానికి సహాయపడుతుంది. ప్రకాష్, ముఖ్య ప్రణాళిక అధికారి, ములుగు, పర్యవేక్షణ చేసి పారదర్శికంగా నిర్వహించాలని అదేశించిన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య. లాల్ నాయక్, రమేష్ బాబు,గణాంక అధికారులు, లక్ష్మీనారాయణ, మరియ వంశీ, నాగరాజు, తిరుపతి, మరియు శ్రీనివాస్, ప్రసాద్ లు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పరామర్శ



**కారేపల్లి, మార్చి 23 :** ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ వాంకుడొత్ జగన్ నాయక్ సతీమణి జమున ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ సోమవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పాత కమలపురంలో గుండెపోటుతో మృతి చెందిన సర్పంచ్ తేజవత్ బాబురావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆదే గ్రామానికి చెందిన కట్ల భద్రమ్మ ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధరవత్ పాండ్య నాయక్, మండల రైతుబంధు మాజీ కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఇల్లెందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడొత్ నరేశ్, టీడీపీ పాత కమలాపురం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు కొత్త తిరుపతయ్య, కాటన్నీ రామారావు, తోటకూరి తిరుపతయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, కొడిమళ్ల వెంకన్న, కొర్ర నాగేశ్వరరావు, తేజవత్ కిషన్, సపావట్ కోటి, పాతకమలాపురం యూత్ అధ్యక్షుడు భూక్య నందు, భూక్య రవి, శ్రావణ్, రాజేష్, కోటి, దారావత్ వెంకట్, గిరిజన సంఘం నాయకులు భూక్య రాంకిషోర్ నాయక్, బానోతు రాజేష్ నాయక్, ఎన్టీఆర్ సేవా సమితి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త వెంకట్ చౌదరి పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణకు ఆదరణ కరువు

**కారేపల్లి :** గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణకు ఆదరణ కరువైంది. పంచాయతీ వార్డు సభ్యులకు పరిపాలన అంశాలతో పాటు గ్రామాభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, పంచాయతీ విధులు, నిధులపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల వారిగా ఎంపిక చేసి వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని అప్పాయిగూడెం రైతు వేదికలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు వార్డు సభ్యులు నామమాత్రంగా హాజరు కావడంతో అధికారులు శిక్షణ తరగతులను మ..మ.. అనిపిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులను మూడు గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపులో 116 మందికి పైగా చొప్పున వార్డు సభ్యులను చేర్చి మూడు విడతలుగా ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతలో భాగంగా సోమవారం నిర్వహించిన శిక్షణకు 116 మంది వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా సగం మందికి అటు ఇటుగా మాత్రమే హాజరయ్యారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పాలన పరమైన శిక్షణకు ఐదు రోజులు సమయం కేటాయించని వార్డు సభ్యులు ఐదు సంవత్సరాలు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంత చిత్తశుద్ధితో పని చేయగలుగుతారో అని వివిధ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వార్డు సభ్యుల శిక్షణకు సభ్యులు హాజరు కాకపోవడం అంటే అది శిక్షణ లోపమా? శిక్షకుల లోపమా? అధికారుల లోపమా? అనే ప్రశ్న తలెత్తుతున్నాయి. నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలక మండలి సభ్యులతో అధికారులు సమన్వయం చేసుకుని శిక్షణ తరగతులను జయప్రదంగా నిర్వహించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి

**సూర్యాపేట :** ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు భరోసా కల్పించడంలో పోలీస్ శాఖ తక్షణ చర్యలు తీసుకుంటుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. ఫిర్యాదుల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

## రేపే జైనూర్‌లో వారపు సంతల వేలం పాట

**జైనూర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తై బజార్, పశువుల సంతలను ఈ నెల 24న వేలంపాట వేస్తున్నట్లు జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, గ్రామ పంచాయతీ ఇంచార్జి ఈవో ఆనందరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు తై బజార్‌కు ఒక్కొక్కరు రూ.50 వేలు, పశువుల సంత వేలం పాటలో పాల్గొనే వారు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించి, నిబంధనల ప్రకారం వేలం పాటలో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు.

# బిజినెస్

## ఎయిర్‌లైన్స్‌కు లిక్విడిటీ మద్దతు ఇచ్చే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, పెరుగుతున్న ఇంధన ధరల వల్ల కార్యకలాపాల అంతరాయాలు విమానయాన రంగాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విమానయాన సంస్థలకు లిక్విడిటీ మద్దతు ఇవ్వాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పన్ను ఉపశమన అవకాశాలను కూడా పరిశీలిస్తోందని, ఈ సమస్యపై చర్చించడానికి రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతుందని వెల్లడించారు. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా, పాకిస్తాన్ గగనతలాలు మూసివేత కారణంగా ఫ్లైట్ రూట్లు పెరిగాయి. దీనివల్ల నిర్వహణ ఖర్చులూ పెరిగాయి. ప్రధానంగా ఇంధన ఖర్చులు ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వాటా దాదాపు 40 శాతం ఉంటుంది. దీంతో ఇటీవలి వీటి పెరుగుదల లాభాల మార్జిన్‌లను గణనీయంగా ప్రభావితం చేశాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ జెట్ ఫ్యూయల్ మానిటర్ ప్రకారం, 2026, మార్చి నాటికి ఈ ప్రాంతంలో జెట్ ఫ్యూయల్ ధరలు 85 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి.

## ఒక్క మార్చిలోనే రూ. 93 వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి



భారత కరెన్సీ రూపాయి క్రమం తప్పకుండా రికార్డు స్థాయి కనిష్టాలకు బలహీనపడుతుండటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులు వెనక్కి తీసుకెళ్తున్నారు.వీటితో పాటు పెరుగుతున్న ముడిచమురు ధరలు దేశ మౌలిక సదుపాయాలకు ముప్పుగా పరిణమించాయి. దీని ఫలితంగా స్టాక్ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) షేర్ల అమ్మకాలు ఈ నెలలో రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఎన్‌ఎస్‌డీఎల్, బీఎస్‌ఈ సంయుక్త డేటా ప్రకారం, ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు కేవలం స్టాక్ మార్కెట్ల నుంచే రూ. 93,698 కోట్లను ఉపసంహరించుకున్నారు. ఎన్‌ఎస్‌డీఎల్ ప్రకారం, ఇది 2024, అక్టోబర్‌లో నమోదైన రూ. 94,017 కోట్లకు అత్యంత చేరువగా ఉంది. దీంతో 2026లో మొత్తం ఎఫ్‌పీఐ నిధుల ఉపసంహరణ దాదాపు రూ. 1.10 లక్ష కోట్ల మార్కును అధిగమించింది. ఫిబ్రవరిలో 17 నెలల గరిష్ట స్థాయి అయిన రూ. 22,615 కోట్ల భారీ నిధుల ప్రవాహం నమోదైన తర్వాత, పెట్టుబడిదారుల సెంటిమెంట్‌లో వచ్చిన తీవ్రమైన మార్పును ఇది స్పష్టంగా తెలియజేస్తోందని మార్కెట్ విశేషకులు పేర్కొన్నారు.

# తిరుగులేని శక్తిగా భారత్

## అమెరికా మ్యాగజైన్ వెల్లడి

గత కొన్నేళ్లుగా భారత ఆర్థికవ్యవస్థ అత్యంత వేగవంతమైన వృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా మనదేశ ఆర్థిక వృద్ధిని ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన మ్యాగజైన్ 'వాషింగ్టన్ ఎగ్జామినర్' భారత్‌కు సంపన్న దేశంగా ఎదిగే సామర్థ్యం అత్యధికంగా ఉందని అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి ఇది సాధ్యమని మ్యాగజైన్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచదేశాలు భారత్‌ను ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా చూస్తున్నాయని వెల్లడించింది. వాషింగ్టన్ ఎగ్జామినర్ నివేదిక కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రధానంగా గడిచిన రెండు దశాబ్దాలను పరిగణలోకి తీసుకుని, 2003 నుంచి దేశ ఆర్థికవ్యవస్థ సగటు వార్షిక వృద్ధి రేటు 7 శాతానికి పైగా ఉందని పేర్కొంది. రాబోయే మరో 20 ఏళ్ల వరకు ఇదే వృద్ధి వేగాన్ని కొనసాగిస్తే దేశ తలసరి జీడీపీ 15,000 డాలర్లను దాటుతుంది. తద్వారా భారత్ అధిక-ఆదాయ పరిమితిని దాటేస్తుంది. దీనివల్ల భారత్ మిడిల్-ఇన్‌కమ్ ట్రాప్ నుంచి బయటపడుతుంది. ఈ స్థాయి వృద్ధితో మధ్య-ఆదాయ ట్రాప్‌లో చిక్కుకున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, తుర్కియే వంటి ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమించే అవకాశాలు ఉన్నాయి. భారతదేశ వృద్ధి అవకాశాలకు అనుకూలంగా అధిక జనాభా, పెరుగుతున్న సాంకేతికత వినియోగం, పాలసీలు వంటివి మద్దతునిస్తున్నాయని వాషింగ్టన్ ఎగ్జామినర్ తెలిపింది. ముఖ్యంగా యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం. అమెరికా, చైనాల కంటే భారత్‌లో ఎక్కువ యువత ఉంది. వచ్చే




దశాబ్దాల్లో గణనీయమైన సంఖ్యలో యువత శ్రామిక శక్తిలో ప్రవేశించనుంది. దీనివల్ల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ధోరణి పటిష్టమైన దేశీయ మార్కెట్‌ను ఇస్తుంది. వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. ఈ ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ప్రస్తుతం దేశంలో రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ కారిడార్ల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశంలో మరింత సమర్థవంతమైన రవాణా వ్యవస్థ సరఫరాను బలోపేతం చేస్తుందని నివేదిక వివరించింది.

## అమెరికాకు నిలిచిన మసాలా ఎగుమతులు

అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధోన్మాదం భారత ఎగుమతులను తీవ్ర ప్రభావితం చేస్తోంది. భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు స్తంబించాయి. భారత్ నుండి ఏటా సుమారు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4700 కోట్లు) విలువైన మసాలా దినుసులు అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. ప్రస్తుత అనిశ్చితి వల్ల అక్కడి కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్ నెలలో ఎగుమతిదారులు, కొనుగోలుదారులు ప్రాథమిక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం, పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ రిస్క్ సర్‌ఛార్జీల కారణంగా కొనుగోలుదారుల నుండి ఎటువంటి స్పందన రావడం లేదని ఎగుమతిదారులు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మసాలా దిగుమతుల సాగు విస్తీర్ణం 5.09 మిలియన్ హెక్టార్లకు లేదా 1.4 శాతం పెరిగి ఉత్పత్తి 12.99 మిలియన్ టన్నులకు చేరుకున్నప్పటికీ, ఎగుమతులు నిలిచిపోవడంతో దేశీయంగా మిగులు నిల్వలు పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని ఈ రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మిరియాలు, యాలకులు, మిరపకాయలు, ధనియాలు, కరివేపాకు పొడి వంటి ఉత్పత్తుల ఎగుమతులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా ఖర్చులు భారీగా పెరగడం మరియు కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా కొనుగోలుదారుల నుండి ఎటువంటి ఆర్డర్లు లేవు. ఇది ఎగుమతిదారులలో ఆందోళన కలిగిస్తోంది. అనిశ్చితి, రవాణా ఇబ్బందుల వల్ల రైతులు తమ ఉత్పత్తులకు




గిట్టుబాటు ధర లభించక ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి" అని ఓ ఎగుమతిదారు తెలిపారు.

# వైభవ్‌పై డివిలియర్స్ ప్రశంసలు!

## ఆర్సీబీ స్టార్ షాకింగ్ కామెంట్స్

పద్నాలుగేళ్ల వయసులోనే క్రికెట్ ప్రపంచంలో అద్భుతాలు చేశాడు వైభవ్ సూర్యవంశీ. ఇటు ఐపీఎల్‌లో.. అటు భారత అండర్-19 క్రికెట్ జట్టు తరఫునా సత్తా చాటాడు. క్యాష్ రిచ్ లీగ్‌లో విధ్వంసకర శతకంతో అతి పిన్న వయసులో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిన ఈ బిహారీ పిల్లాడు.. అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో 80 బంతుల్లోనే 175 పరుగులు చేశాడు. తద్వారా భారత్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన వైభవ్‌ను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఇక ఇటీవలే పదిహేనో వసంతంలో అడుగుపెట్టిన వైభవ్.. ఐపీఎల్-2026లో రాజస్తాన్ రాయల్స్ తరఫున మరోసారి సత్తా చాటేందుకు సన్నద్ధమయ్యాడు.

**అతడొక గొప్ప ఆటగాడు**

ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ (ఋఱఎష్ణుజ ాబతీఋుఋుఅంష్త్రఱ) గురించి సౌతాఫ్రికా బ్యాటింగ్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ చేసిన వ్యాఖ్యలు.. అందుకు ప్రతిగా టీమిండియా స్టార్, ఆర్సీబీ ఆటగాడు జితేశ్ శర్మ (జీఱవంష్త్ర ాష్త్రుతీఋు) బదులిచ్చిన తీరు వైరల్‌గా మారింది. "అతడొక గొప్ప ఆటగాడు. అండర్-19 క్రికెట్‌లో అతడి ఆట తీరును నేను గమనించాను. ఐపీఎల్‌లాంటి పెద్ద టోర్నీలో ఆడిన తర్వాత అదే స్థాయిలో.. అవే ప్రమాణాలు పాటిస్తూ




ముందుకు సాగడం అందరికీ సాధ్యం కాదు. అయితే, వైభవ్ సూర్యవంశీ మాత్రం వరల్డ్‌కప్ టోర్నీలో అంతే ప్రొఫెషనల్‌గా, భయం లేకుండా ఆడటం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది.

**ప్రొఫెషనల్‌గా ఎదుగుతాడు**

ఆ వయసుకే అతడు అంతగా పరిణతి చెందిన తీరు నన్ను ఆశ్చర్యపరిచింది. ఎక్కడ ఆడుతున్నా తన గేమ్‌ప్లాన్‌కు కట్టుబడి ఉంటాడు. తను తనలాగే ఆడతాడు. వేరే వాళ్లను అనుకరించే ప్రయత్నం చేయడు. బౌలర్లను గౌరవిస్తాడు. చెత్త బంతుల్ని మాత్రం అస్సలు వదిలిపెట్టడు. అతడొక గొప్ప ప్రొఫెషనల్‌గా ఎదుగుతాడు" అని డివిలియర్స్ ప్రశంసలు కురిపించాడు.

అయితే, ఇందుకు జితేశ్ శర్మ బదులిస్తూ.. "అతడు అస్సలు ప్రొఫెషనల్ కాదు. నేను ఈ మాట కచ్చితంగా చెప్పగలను" అంటూ సరాదాగా కామెంట్ చేశాడు. "అందరూ అతడిని ప్రొఫెషనల్ అనుకుంటారు. మైదానంలో అతడు ఎలా ఉంటాడన్నది పక్కనపెడితే.. మైదానం వెలుపల మాత్రం అస్సలు చెప్పిన మాట వినడు. రాత్రివేళ ఐస్‌క్రీమ్ తినొద్దని నేను ఎంతగానో మొత్తుకున్నా.

**చెప్పిన మాట అసలే వినడు**

అయినా అతడు నా మాట వినలేదు. ఈ విషయంలో అతడు ఎప్పుడూ ఎవరి మాటా వినడు" అని జితేశ్ శర్మ వైభవ్‌కు ఉన్న అలవాటు గురించి డివిలియర్స్‌కు చెప్పాడు. కాగా చిన్న వయసు కాబట్టి ఐస్‌క్రీమ్ పట్ల వైభవ్‌కు ఆ మాత్రం ఇష్టం ఉండటం సహజమే. అయితే, ప్రొఫెషనల్ క్రికెటర్‌గా ఎదిగే క్రమంలో డైట్ పాటిస్తూ జీవనశైలిని మెరుగుపరచుకుంటేనే ఫిట్‌గా ఉండి.. అనుకున్న శిఖరాలకు చేరుకోగలడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఏసీసీ ఎమర్జింగ్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత జట్టుకు జితేశ్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించగా.. వైభవ్ సూర్యవంశీ అందులో సభ్యుడిగా ఉన్నాడు.

## ధోనీ కీపింగ్.. మురళీధరన్ వర్సెస్ శాంసన్.. ఏం జరిగిందో చూడండి

**చెన్నై:** ఈ యేటి ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరో 5 రోజుల్లో ప్రారంభంకానున్నది. అయితే ఆ సీజన్ ప్రారంభానికి ముందు.. చెన్నైలోని చిదంబరం స్టేడియంలోలో సీఎస్కే జట్టు ఫ్యాన్ ఎంగేజ్మెంట్ ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేసింది. చెన్నై సూపర్ కింగ్స్ తన తొలి మ్యాచ్‌ను గౌహతితో రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనున్నది. అయితే ఆదివారం చెపాక్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నై మాజీ ప్లేయర్లతో పాటు ప్రజెంట్ ప్లేయర్లు క్రికెట్ అభిమానుల్ని థ్రిల్ చేశారు. లెజెండరీ బౌలర్ ముత్తయ్య మురళీధరన్, సీఎస్కే ప్లేయర్ ధోనీ, సంజూ శాంసన్ మైదానంలో హల్ చల్ చేశారు. చెన్నై జట్టుకు కొత్తగా రిక్రూట్ అయిన శాంసన్.. మురళీధరన్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. ఆ ఓవర్‌కు ధోనీ కీపింగ్ చేశాడు. అయితే తొలి రెండు బంతుల్ని డిఫెన్స్ ఆడిన శాంసన్.. ఆ తర్వాత భారీ హిట్‌కు ప్రయత్నించాడు. ముందుకు వచ్చి ఆ బంతిని కొట్టబోయాడు. కానీ శాంసన్ బ్యాట్ నుంచి బంతి మిస్సైంది. కీపర్ ధోనీ ఆ బంతిని అందుకుని స్టంప్ చేయబోయాడు. కానీ స్టంప్స్‌ను కొట్టకుండా కావాలని మిస్ చేశాడు. ఇక ఆ



తర్వాత బంతిని కూడా శాంసన్ కనెక్ట్ చేయలేకపోయాడు. ఇక ఫైనల్ బంతికి మాత్రం భారీ సిక్సర్ కొట్టాడు. ఆ బంతి స్టాండ్స్‌లోకి వెళ్లి పడింది. దీంతో చెపాక్ మైదానంలోని ప్రేక్షకులు ఫుల్ చీర్స్ కొట్టారు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతోంది.


# స్పోర్ట్స్

## పాక్ ఆటగాడికి ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు




టీ20 ప్రపంచకప్-2026లో అద్భుత ప్రదర్శన కనబరిచిన పాకిస్తాన్ యువ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఫిబ్రవరి నెలకు గానూ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'గా ఫర్హాన్ ఎంపికయ్యాడు. ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్, అమెరికా పేసర్ షాడ్లీ వాన్ షాల్క్‌విక్‌లను వెనక్కి నెట్టి ఫర్హాన్ ఈ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ సెమీస్‌కు చేరడంలో విఫలమైనప్పటికి.. సాహిబ్జాదా ఫర్హాన్ మాత్రం దుమ్ములేపాడు. ఒక్క భారత్‌పై తప్ప ప్రతీ మ్యాచ్‌లోనూ అతడు బ్యాట్ ఝులిపించాడు. నమీబియా, శ్రీలంకపై సెంచరీలతో అతడు చెలరేగాడు. తద్వారా ఒకే టీ20 ప్రపంచకప్‌లో రెండు సెంచరీలు బాదిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మొత్తంగా 383 పరుగులు సాధించి, ఒకే టీ20 వరల్డ్ కప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లిని అతడు అధిగమించాడు. ఈ క్రమంలోనే అతడికి ఐసీసీ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఫర్హాన్ కంటే ముందు బాబర్ ఆజం, ఫఖర్ జమాన్, నోమన్ అలీ, హసన్ అలీ వంటి పాక్ ఆటగాళ్లు ఈ ఐసీసీ అవార్డును సొంతం చేసుకున్నారు. బాబర్‌కు అయితే అత్యధికంగా మూడు సార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు. ఇక మహిళల విభాగంగాలో భారత స్టార్ ఆల్‌రౌండర్ అరుంధతి రెడ్డి ఈ అవార్డు వరించింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అరుంధతి మొత్తం 8 వికెట్లు పడగొట్టింది. ఆసీస్‌తో టీ20 సిరీస్‌ను సొంతం చేసుకోవడంలో అరుంధతిది కీలక పాత్ర.

# బాహుబలి, ఆర్ఆర్ఆర్ రికార్డ్స్ బ్రేక్..



ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర 'ధురంధర్ 2' సినిమా సంచలనాలు సృష్టిస్తోంది. బీభత్సమైన అంచనాలతో బరిలోకి దిగిన ఈ మూవీ ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోని బీ,సీ సెంటర్లలోనూ హవా చూపిస్తుండటం ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరుస్తోంది. మొదటి రోజు నుంచి వందల కోట్ల వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం ఇప్పుడు తొలి వీకెండ్ పూర్తయ్యేసరికి ఊహించని రికార్డులు సొంతం చేసుకుంది. ఇంతకీ నాలుగు రోజుల కలెక్షన్స్ ఎన్ని కోట్లు వచ్చాయంటే? తొలి వీకెండ్ పూర్తయ్యేసరికి 'ధురంధర్ 2' చిత్రానికి రూ.750 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం ఒక్కరోజే కేవలం మన దేశంలోనే రూ.115 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదో రికార్డ్. ఇప్పటివరకు వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'పుష్ప 2' రూ.762 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా.. దీని తర్వాతి స్థానంలోకి 'ధురంధర్ 2' వెళ్లింది. ఈ క్రమంలోనే బాహుబలి 2 (రూ.591 కోట్లు), ఆర్ఆర్ఆర్ (రూ.470 కోట్లు), కల్కి 2898 ఏడీ (రూ.500 కోట్లు) తదితర రికార్డులు బ్రేక్ చేసింది. మరోవైపు బాలీవుడ్‌లోనూ ఇప్పటివరకు షారుఖ్ ఖాన్ 'పఠాన్' పేరిట రూ.287 కోట్ల కలెక్షన్స్ రికార్డ్ ఉంది. దీన్ని 'ధురంధర్ 2' అధిగమించడంతో పాటు సరికొత్త ఘనత సాధించింది. చూస్తుంటే ఇప్పుడప్పుడే ఈ చిత్ర రచ్చ ఆగేలా లేదు. తొలి వారం పూర్తయ్యేసరికి రూ.1000 కోట్లు సాధించడం పక్కా అనిపిస్తుంది. అలానే రూ.2000 కోట్ల మార్క్‌ని కూడా త్వరలోనే అందుకునే అవకాశముందని విశ్లేషకులు మాట్లాడుకుంటున్నారు.



# ముంబై స్లమ్స్‌లో విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'..!

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.



# 'తెరచాప' ట్రైలర్ రిలీజ్

అనన్య క్రియేషన్స్ బ్యానర్‌పై కైలాష్ దుర్గం నిర్మాతగా తీస్తున్న సినిమా 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వం వహించారు. నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు హీరోహీరోయిన్లుగా నటించారు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ తదితరులు ఇతర పాత్రలు చేశారు. ప్రజల్ క్రిష్, ఎం.ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. విడుదల తేది దగ్గరవుతున్న సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. తెరచాప ట్రైలర్ చూస్తుంటే సముద్రతీరంలో జరిగే ఒక ఊరి కథలా అనిపిస్తుంది. ఊరంటే మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలుతో పాటు రాజకీయాలు, భేద భావాలు ఉండడమూ సహజమే. అలాంటి పరిస్థితుల మధ్య ఒక యువకుడు తన ఊరిలో ఉన్న పరిస్థితులపై ఎలా పోరాడాడు? అనేదే స్టోరీ.



# మైక్రో ఫైనాన్స్ మోసాలపై సింగర్ మంగ్లీ క్లారిటీ

**నా పేరుతో డబ్బులు వసూలు చేస్తే నమ్మొద్దు..**

ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి ఎలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, "నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదు" అని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ఫైనాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు. నా ప్రొఫెషనల్ ఈవెంట్స్ తప్ప నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. ఎవ్వరైనా నా పేరు చెప్పి డబ్బులు అడిగితే దయచేసి నమ్మకండి. అలాంటి మోసాలకు గురైన వారికి న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరుతున్నాను అని మంగ్లీ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనతో, మంగ్లీ పేరును వాడుకొని జరుగుతున్న మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగే అవకాశం ఉంది. ఇకపై ఇలాంటి ఘటనలపై జాగ్రత్తగా ఉండాలని ఆమె అభిమానులకు సూచించారు.ఇక ఇదిలా ఉంటే ఇటీవల మంగ్లీ పాన్-ఇండియా చిత్రం ఖఃణ: ది డెవిల్ సినిమా కోసం ఒక పాట పాడింది. 'సర్కే చునర్ తేరి సర్కే' పాటలో డబుల్ మీనింగ్ లిరిక్స్ ఉన్నాయనే ఆరోపణలతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలో మంగ్లీ సోషల్ మీడియాలో స్పందిస్తూ... 'ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ పాటను తొలగించాం. అనుకోకుండా జరిగిన పొరపాటుకు హృదయపూర్వక క్షమాపణలు' అని తెలిపారు.వీశీజఱవం

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463